Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 108 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శనివారం, 1 - 11 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## ఆర్ఎస్ఎస్‌ను నిషేధించాలి.. ఖర్గే డిమాండ్





**న్యూఢిల్లీ:** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌పై నిషేధం విధించాలని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మరోసారి డిమాండ్ చేశారు. అయితే ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని అన్నారు. ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలలో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనకుండా సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కూడా ఒకసారి నిషేధం విధించారని ఆయన వాదించారు. శుక్రవారంనాడిక్కడ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశంలో ఎక్కువగా శాంతిభద్రతల పరిస్థితి తలెత్తడానికి బీజేపీ-ఆర్ఎస్ఎస్ కారణమని తాను భావిస్తున్నట్టు చెప్పారు. పటేల్ హయాంలో నిషేధం విధిస్తే 2024లో బీజేపీ ప్రభుత్వం ఆ నిషేధాన్ని ఎత్తివేసిందని, ఇప్పుడు మళ్లీ ఆర్ఎస్ఎస్‌పై నిషేధం విధించాలని అన్నారు. కశ్మీర్ మొత్తాన్ని దేశంలో కలపాలని సర్దార్ పటేల్ కోరుకున్నారని, అందుకు అప్పటి ప్రధాని నెహ్రూ నిరాకరించారని నరేంద్ర మోదీ వ్యాఖ్యలు చేసిన క్రమంలో ఖర్గే తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. సర్దార్ పటేల్ అప్పట్లో జన్‌సంఘ్ పార్టీ సంస్థాపక అధ్యక్షుడు, ఆర్ఎస్ఎస్ నేత శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి రాసిన లేఖను ఖర్గే ప్రస్తావిస్తూ, మహాత్మాగాంధీ హత్యకు దారి తీసిన పరిస్థితిని ఆర్ఎస్ఎస్ సృష్టించిందని ఆ లేఖలో పటేల్ పేర్కొన్నట్టు తెలిపారు. భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్ మధ్య విభేదాలున్నట్టు చిత్రిస్తూ బీజేపీ చరిత్రను వక్రీకరించిందని ఖర్గే తప్పుపట్టారు. అయితే నెహ్రూ, పటేల్ మధ్య చక్కటి సంబంధాలు ఉండేవని, ఇద్దరూ ఒకరినొకరు ప్రశంసించుకునే వారని తెలిపారు. అక్టోబర్ 31న సర్దార్ పటేల్ జయంతి అయితే, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి అని, వీరిద్దరూ గొప్ప నేతలని ఖర్గే కొనియాడారు. పటేల్ ఉక్కు మనిషి అయితే, ఇందిరాగాంధీ ఉక్కు మహిళ అని, ఇద్దరూ దేశానికి ఎంతో సేవ చేశారని, దేశ ఐక్యతకు పాటుపడ్డారని అన్నారు. 'ఇది కాంగ్రెస్ చరిత్ర... కాంగ్రెస్ కంట్రిబ్యూషన్' అని ఖర్గే పేర్కొన్నారు.

**కాంగ్రెస్ నయవంచన.. బీజేపీ**

ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ వెంటనే స్పందించింది. కాంగ్రెస్ పార్టీ పటేల్ పేరును రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని తప్పు పట్టింది. పటేల్ వారసత్వాన్ని దశాబ్దాలుగా కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసిందని, ఇప్పుడు ఆర్ఎస్ఎస్‌పై దాడికి ఆయన పేరును వాడుకుంటోందని బీజేపీ ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఆరోపించారు. 'ఐఎన్‌సీ అంటే ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ కాదు. ఇండియన్ నాజీ కాంగ్రెస్. కాంగ్రెస్ ఎన్ని కుట్రలు పన్నినా ఆర్ఎస్ఎస్‌పై నిషేధాన్ని కోర్టు ఎత్తివేసింది. ఆర్ఎస్ఎస్ రాజకీయేతర సంస్థ అని, ఆ సంస్థ కార్యక్రమాల్లో ప్రభుత్వ ఉద్యోగాలు పాల్గొనవచ్చని కోర్టు చెప్పింది. ఇది సహించలేని కాంగ్రెస్ పార్టీ.. పీఎఫ్ఐ, ఎస్‌డీపీఐ, ఎంఐఎంలకు బాసటగా ఉంటూ దేశ సంక్షేమం కోసం పాటు పడుతున్న ఆర్ఎస్ఎస్‌పై విషం చిమ్ముతోంది' అని ఆయన అన్నారు.

## సర్దార్‌కు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఘన నివాళులు




**అమరావతి, (రాజధాని వార్తలు):** భారత తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఘన నివాళులర్పించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మహనీయుడు సర్దార్‌ను స్మరించుకున్నారు. జాతీయ ఐక్యతకు పునాది వేసిన సుస్థిర జాతి శిల్పి పటేల్ అని ముఖ్యమంత్రి అన్నారు. దేశ ఐక్యతకు సర్దార్ ఎంతో కృషి చేశారని మంత్రి లోకేష్ వెల్లడించారు.

**చంద్రబాబు ట్వీట్..**

'భారత రాజ్యాంగంలో పౌరులకు ప్రాథమిక హక్కులు మాత్రమే కాదు, వాటిని కాపాడే బాధ్యత కూడా ప్రతి పౌరుడిదని బోధించిన మహనీయ దార్శనికుడు... ఉక్కు సంకల్పంతో దేశాన్ని ఏకతాటిపైకి తీసుకువచ్చి, జాతీయ ఐక్యతకు పునాది వేసిన సుస్థిర జాతి శిల్పి... దేశ సమగ్రతకు మార్గదర్శకుడైన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆ మహనీయుని ఆత్మస్ఫూర్తికి నివాళులు' అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

**మహనీయుని స్మృతికి నివాళులు: లోకేష్**

'ఉక్కుమనిషి, భారత తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి ఘన నివాళులు అర్పిస్తున్నాను. దేశ ఐక్యతకు కృషిచేసిన వ్యక్తి సర్దార్ వల్లభాయ్ పటేల్. దేశ తొలి హెూంమంత్రిగా, ఉప ప్రధానిగా విశేష సేవలు అందించారు. ధృడమైన సంకల్పం, అచంచల నాయకత్వం ఆయన సొంతం. జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ అందించిన సేవలను స్మరించుకుందాం' అంటూ మంత్రి లోకేష్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## ఏపీలో దారుణం.. ఐసీయూలో బాలికపై వృద్ధుడి అత్యాచారయత్నం



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** బాలికలు, మహిళలు, వృద్ధులపై ఎక్కడో ఒకచోట అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయి. ఒంటరిగా ఉన్న అమ్మాయిలను చిదిమేసేందుకు కీచకులు ఎంతటి దుశ్చ ర్యకైనా పాల్పడుతున్నారు. అభం శుభం తెలియని చిన్నారులపై కూడా కామవాంఛ తీర్చుకుంటున్నారు. చిన్న పిల్లల నుంచి వృద్ధ మహిళల వరకు ఎవ్వరినీ విడిచిపెట్టడం లేదు. ఒంటరిగా ఉన్న ఆడవాళ్లపై కన్నేసి, కామాంధులు అత్యాచారానికి పాల్పడుతున్నారు. మరికొందరైతే అత్యాచారం చేసి దారుణంగా హత్యలు చేస్తున్నారు. కొంతమంది క్రూరమైన వికృత మృగాళ్లు ఉన్న సమాజంలో ఆడవాళ్లు ఒంటరిగా వెళ్లాలంటే భయపడుతున్నారు. ఇలాంటి ఘటనే మరొకటి జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో మరో దారుణం తీవ్ర కలకలం రేపుతోంది. నెల్లూరు జిల్లా గూడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఐసీయూలో 8 ఏళ్ల బాలికపై 50 ఏళ్ల వయసున్న వృద్ధుడు అత్యాచారయత్నం చేశాడు. ఆసుపత్రిలో తన తండ్రి వద్ద అటెండర్‌గా బాలిక ఉంటోంది. ఈ క్రమంలోనే ఎవరూ లేని సమయంలో కామాంధుడు దుశ్చర్యకు పాల్పడ్డాడు. దీనిని గమనించిన ఆసుపత్రి సిబ్బంది, అక్కడున్న రోగుల అటెండర్లు సదరు కామాంధుడికి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందడంతో డీఎస్పీ గీతాకుమారి విచారణ చేపట్టారు.


## పాండురంగ స్వామి ఉత్సవాలు.. పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి


**కృష్ణా జిల్లా, (రాజధాని వార్తలు):** జిల్లాలోని మచిలీపట్నంలో చిలకలపూడి పాండురంగ స్వామి ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం నుంచి ఆరు రోజుల పాటు స్వామి వారి ఉత్సవాలు ఘనంగా జరుగనున్నాయి. ఉత్సవాల సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర సతీసమేతంగా స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయానికి వచ్చిన మంత్రికి మేళతాళాలు, పూర్ణకుంభంతో ఉత్సవ కమిటీ స్వాగతం పలికింది. ఆపై స్వామివారిని దర్శించుకుని.. ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి దంపతులతో పాటు ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు.


ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం పాండురంగడి ఉత్స వాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంవ త్సరం కూడా ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేశామని తెలిపారు. నవంబర్ 2న స్వామి రథోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహిం చనున్నామని చెప్పారు. 3న నాగులేరు కాలువలో తెప్పోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అలాగే 5వ తేదీన జరిగే కార్తీక పౌర్ణమి సముద్ర స్నానాలకు కూడా ఏర్పాట్లు చేశామని మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు.


# "వైజాగ్ పునర్నిర్మాణ దిశలో చంద్రబాబు దూరదృష్టి, ప్రభుత్వం చర్యలు ఎప్పుడు!"

**- మౌలిక వసతుల ఆధునీకరణ, సురక్షిత గృహాలు, పర్యాటక ప్రోత్సాహం - గ్లోబల్ సిటీకై సమగ్ర ప్రణాళిక - పెట్టుబడులు, నీటి భద్రత, పౌర సదుపాయాలు, పర్యాటక భద్రతలపై సమన్వయపూర్వక చర్యలు అవసరం - జీవిఎంసి, ప్రభుత్వం, ప్రజల కలసికట్టుతో సురక్షిత, సుస్థిర వైజాగ్ నిర్మాణం - ఆర్థిక, సాంకేతిక రాజధానిగా ప్రచారం - మరోవైపు శిథిలమై కనిపిస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ నివాస సముదాయాలు, తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులు, మంచినీటి, డ్రైనేజి సమస్యలు**




బీచ్ రోడ్డులోని శిథిలమై కనిపిస్తున్న నివాస భవనాలు

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** "సిటీ ఆఫ్ డెస్టినీ"గా ప్రసిద్ధి చెందిన ఈ నగరం, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చురుకైన నాయకత్వంతో పెట్టుబడులు, ఆవిష్కరణలు ఇంకా పర్యాటక రంగాల్లో అంతర్జాతీయ గమ్యస్థానంగా మారేందుకు సిద్ధంగా ఉంది. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక, సాంకేతిక రాజధానిగా ఉన్న వైజాగ్, ప్రపంచస్థాయి మార్పు అంచున ఉంది. అంతర్జాతీయ సంస్థలైన గూగుల్, టాటా, సిఫీ వంటి ప్రముఖ సంస్థలు డేటా సెంటర్ మౌలిక వసతుల రంగంలో బిలియన్ డాలర్ల స్థాయిలో పెట్టుబడులు ప్రకటించడంతో, వైజాగ్ భారతదేశం తదుపరి వాణిజ్య, సాంకేతిక, పర్యాటక శక్తికేంద్రంగా ఎదగనుంది. వైజాగ్ నగర సామర్థ్యాన్ని పూర్తిగా వెలికి తీయడానికి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ మౌలిక సదుపాయాల ఆధునీకరణ, సురక్షిత గృహాలు, నీటి భద్రత, పౌర సవాళ్లు ఇంకా పర్యాటక ప్రాధాన్యతలపై దృష్టి సారించి సమగ్ర ప్రణాళికను అమలు చేయాలి. అలాగే, ప్రపంచస్థాయి కంపెనీలు, నైపుణ్య నిపుణులు ,పర్యాటకులను ఆకర్షించే ఒక సమగ్ర వ్యవస్థను సృష్టించాలి.

**1. ప్రపంచస్థాయి మౌలిక వసతుల నిర్మాణం**

దేశ, అంతర్జాతీయ వ్యాపారాలు, పర్యాటకులను ఆకర్షించేందుకు వైజాగ్ మౌలిక వసతులు, రోడ్లు, సౌకర్యాలను ఆధునీకరించటం తప్పనిసరి. ప్రధాన వ్యాపార కూడళ్లలో ఇబ్బందులను అధిగమించాలి. జగదాంబ, రామాటాకీస్ ట్రాఫిక్ తీవ్రత ఎక్కువగా ఉంది. సీతమ్మ ధరకు కేవలం ఒకే బస్సు ఉంది. ప్రభుత్వం వీటి మీద సానుకూల చర్యలు తీసుకో వలసి ఉంది. ట్రాఫిక్ నియంత్రణ కోసం ఇంటర్నెట్ అఫ్ థింగ్స్ ఆధారిత సిస్టమ్‌లు, స్మార్ట్ సిగ్నల్స్, రోడ్లపై ఉన్న గుంతల గుర్తించి తగు చర్యలు తీసుకోవాలి. వర్షాకాలంలో వచ్చే నీటి, నిల్వ సమస్యలు, డ్రైనేజ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి. నగర సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే చారిత్రక ప్రదేశాలను కాపాడాలి. వారసత్వ కట్టడాలను సంరక్షిస్తూ పౌర సదుపాయా లను అభివృద్ధి చేయాలి. వీధి జంతువుల నియంత్రణ, శుభ్రత వంటి అంశాలపై దృష్టి సారించాలి. ఇది పౌరుల జీవిత ప్రమాణా లను మెరుగుపరచడమే కాకుండా పెట్టుబడిదారులు, పర్యాటకుల నమ్మకాన్ని పెంచుతుందనటంలో సందేహం లేదు.

**2. వాణిజ్య కార్యాలయ ప్రదేశాల అభివృద్ధి**

అంతర్జాతీయ గూగుల్ సంస్థ వైజాగ్ లో 1 గిగావాట్ సామర్థ్యంతో కూడిన హైపర్ స్కేల్ ఎ ఐ డేటా సెంటర్‌ను 87,520 కోట్ల పెట్టుబడితో వచ్చే 5 ఏళ్లలో ఏర్పాటు చేయడనుండటం విశేషం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటూ అవసరమైన అనుమతులు, భూమి, ఇతర ప్రోత్సాహాలను అందించనుంది. ఈ ప్రాజెక్ట్ లక్షలాది గా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలను సృష్టించడమే కాకుండా, ఇతర అంతర్జాతీయ సంస్థలను కూడా విశాఖ వైపు ఆకర్షించనుంది. టాటా, సిఫీ వంటి పెద్ద సాఫ్ట్‌వేర్ (మిగతా 2వ పేజీలో)

# సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ మహెూన్నతుడు

## - ఘనంగా సర్దార్ @150 యూనిటీ మార్చ్" ర్యాలీ




**విజయవాడ, (రాజధాని వార్తలు):** సర్దార్ వల్లభాయ్ పటేల్ మహెూన్నతుడని విజయవాడ మెంబర్ ఆఫ్ పార్లమెంట్ కేశినేని శివనాధ్ చిన్ని అన్నారు. మై భారత్ (నెహ్రూ యువ కేంద్ర) ఆధ్వర్యంలో శుక్రవారం "సర్దార్ @150 యూనిటీ మార్చ్" ర్యాలీలో మెంబర్ ఆఫ్ పార్లమెంట్ పాల్గొన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా రాష్ట్రీయ ఏక్తా దివాస్ (జాతీయ సమైక్య దినోత్సవం)లో భాగంగా ర్యాలీని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుండి బెంజ్ సర్కిల్ విజయవాడ వరకు పెద్ద ఎత్తున సాగింది. మెంబర్ ఆఫ్ పార్లమెంట్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం గ్రౌండ్సలో జరిగిన సమావేశంలో అతిధులు ప్రసంగించారు. ఈ సందర్భంగా మెంబర్ ఆఫ్ పార్లమెంట్ మాట్లాడుతూ దేశ చరిత్రలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పేరు స్వర్ణాక్షరాలతో లిఖించవచ్చని అన్నారు. వల్లభాయ్ పటేల్ ను ఐరన్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా కీర్తించడం జరిగిందని చెప్పారు. భారత స్వాతంత్ర్య సమరయోధుడిగానే కాకుండా, స్వాతంత్ర్యం అనంతరం దేశ ఐక్యతను సాధించిన మహానేతగా ఆయనకు చరిత్రలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. భారతీయ జనతా పార్టీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ భారత స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 562 దేశీయ సంస్థానాలను భారత రాజ్యాంగంలో విలీనం చేయించడంలో ఆయన అద్భుత కృషి మరువలేనిది అన్నారు. ధైర్యం, తెలివి తేటలు, చర్చా పటిమతో ఈ మహత్తర కార్యక్రమాన్ని పూర్తి చేశారని కొనియాడారు. మై భారత్ జిల్లా యువ అధికారి సుంకర రాము మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ కేవలం నాయకుడే కాదని, దేశ ఐక్యతకు చిహ్నం అన్నారు. ధైర్యం, దేశభక్తికి ప్రతీక అని, ఆయన త్యాగం, కర్తవ్య నిబద్ధత, దృఢ సంకల్పం భారత యువతకు ప్రేరణ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువ సంక్షేమ అధికారి యు శ్రీనివాసరావు జిల్లా యువ సంక్షేమ శాఖ మేనేజర్ డి సుబ్బారావు భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏ శ్రీరామ్ వివిధ కళాశాలల ఎన్ఎస్ఎస్ పిఓలు మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు యువత పాల్గొన్నారు.

# అపోలో హాస్పిటల్స్ – బ్రెయిన్ స్ట్రోక్ అవేర్‌నెస్ మీట్



**కాకినాడ, (రాజధాని వార్తలు):** వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా కాకినాడ అపోలో హాస్పిటల్‌లో బ్రెయిన్ స్ట్రోక్ అవేర్‌నెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యూరో ఫిజీషియన్ డా. కాండ్రేగుల శివరాం గాంధీ మాట్లాడుతూ ప్రజల్లో బ్రెయిన్ స్ట్రోక్ పై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. స్ట్రోక్‌ను ముందుగానే గుర్తించడం, తక్షణమే వైద్య సలహా తీసుకోవడం ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చని ఆయన సూచించారు. బి ఫాస్ట్ అంటే (బ్యాలెన్స్, ఐస్, ఫేస్, ఆమ్స్, స్పీచ్, టైం) అనే సూత్రం ద్వారా స్ట్రోక్ లక్షణాలను గుర్తించవచ్చని వివరించారు. మొదటి నాలుగు గంటల్లో న్యూరో ఫిజీషియన్‌ను సంప్రదిస్తే పక్ష వాతం వంటి తీవ్రమైన సమస్యలను నివారించవచ్చని చెప్పారు. అలాగే ప్రజలందరూ తమ ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని, బీపీ, షుగర్, థైరాయిడ్, ఒబిసిటీ వంటి సమస్యలు ఉన్నవారు నియంత్రణలో ఉంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం క్యాన్సర్ అవేర్‌నెస్ లా, బ్రెయిన్ స్ట్రోక్ అవేర్‌నెస్‌పై కూడా సామాజిక స్థాయిలో ప్రచారం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యూరో సర్జన్ డా.ఎం.వి.వి. కిరణ్ కుమార్ మాట్లాడుతూ స్ట్రోక్ వచ్చినప్పుడు ఆలస్యం చేయకుండా దగ్గరలోని హాస్పి టల్‌కు వెళ్లి న్యూరో స్పెషలిస్టును సంప్రదించడం అత్యవసరమని చెప్పారు. ఆలస్యం జరిగితే బ్రెయిన్ హేమరాజిక్ వంటి ప్రాణాపాయ పరిస్థితులు తలెత్తవచ్చని హెచ్చరించారు. అపోలో హాస్పిటల్స్ యూనిట్ మార్కెటింగ్ హెడ్ ఎన్.అంజిబాబు, డీజీఎం ఆపరేషన్స్ జివిఆర్ మూర్తి, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డా. మని షారోన్ మాట్లాడుతూ అపోలో హాస్పిటల్‌లో 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, ఆదివారాలు కూడా ఓపీ సేవలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజలందరూ అవగాహనతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, సరైన సమయంలో వైద్య సాయం పొందడం ద్వారా స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో డా. కే. శివరాం గాంధీ, డా. ఎం.వి.వి. కిరణ్ కుమార్, డా. రెడ్డప్ప రెడ్డి (సి.ఓ.ఓ), డా.మని షారోన్, ఎన్. అంజిబాబు, జివిఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# తుఫాన్ బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం - ఎమ్మెల్యే నానాజీ





**కరప, (రాజధాని వార్తలు):** మొంధా తుఫాన్ ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన మత్స్య కార కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. కరప మండలం ఉప్పలంక గ్రామంలో బుధవారం తుఫాన్ బాధితులకు ప్రభుత్వం తరపున నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ తుఫాన్ కారణంగా నష్టపోయిన ప్రతి కుటుం బానికి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. బాధితుల పునరావాసం కోసం తక్షణ సహాయ చర్యలు ప్రారంభమయ్యాయని తెలిపారు. పేద ప్రజలు, రైతులు, మత్స్యకారులు కష్టకాలంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం గమనిస్తోందని, ఎవరూ ఆందోళన చెందవద్దని పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబానికి 50 కిలోల బియ్యం, ఒక కిలో కందిపప్పు, ఒక లీటర్ పామ్ ఆయిల్, ఒక కిలో ఉల్లిపాయలు, ఒక కిలో బంగాళాదుంపలు, ఒక కిలో పంచదారతో కూడిన కిట్లను మొత్తం 840 మంది మత్స్యకార కుటుంబాలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, నాయకులు నూరుకుర్తి వెంకటేశ్వరరావు, రంభాల వెంకటేశ్వ రరావు, పితాని లీలా, ఖాదీ బోర్డు డైరెక్టర్ శిరంగు శ్రీనివాస్, తహసిల్దార్ తుమ్మల దుర్గాప్రసాద్, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై కౌన్సిల్లో సభ్యులు ధ్వజం





**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** వార్డుల్లో నెలకొన్న ప్రజా సమస్యలపై అధికారులు స్పందిస్తున్న తీరు ఏమాత్రం బాగాలేదని కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. పెద్దాపురం మున్సిపాలిటీలో కౌన్సిల్ సాధారణ సమావేశం ఇంచార్జి ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. తొలిత జరిగిన జీరో అవర్లో పలువురు కౌన్సిలర్లు వారి వార్డుల్లో నెలకొన్న సమస్యలను అధికారుల వద్ద ఏకరువు పెట్టారు.

ఈ సందర్భంగా వైస్ ఛైర్మన్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, మున్సి పాలిటీ పరిధిలోని అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి సారించాలన్నారు. అత్యవసర సేవలైన త్రాగు నీరు, వీధిలైట్లు, పారిశుద్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఇంకా కమ్యూనిటీ హాల్ నిర్మాణం, వాటి నిధుల కేటాయింపు, బిల్లుల చెల్లింపు వంటి అంశాలపై కౌన్సిలర్లు అధికారులను ప్రశ్నించారు. అనంతరం కౌన్సిల్ అజెండాలోని అంశాలు, అభివృద్ధి పనులపై చర్చించడం పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో రెండవ వైస్ చైర్ పర్సన్ కనకాల మహాలక్ష్మీ, మున్సిపల్ మేనేజర్ యు. జ్యోతిరాణి, మున్సిపల్ డిఇ ప్రకాశరావు, ఆర్వో అచ్యుతరాజు, మున్సిపల్ టిపిఓ చింతా ఫణికుమార్, ఎఇలు పి.వి.సుధాకర్, ఉమామహేశ్వరి, శానిటరీ ఇన్స్పెక్టర్ అదినారాయణ, గంగాధర్, కౌన్సిలర్ గుమస్తా అత్తిలి వీర్రాజు, సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

# "వైజాగ్ పునర్నిర్మాణ దిశలో చంద్రబాబు దూరదృష్టి, ప్రభుత్వం చర్యలు ఎప్పుడు!"











**సీతమ్మ ధారలో శిధిలమై కనిపిస్తున్న నివాస సముదాయాలు**

(మొదటి పేజీ తరువాయి)

సంస్థలు కూడా డేటా సెంటర్‌లను ఏర్పాటు చేయ నున్నాయి. ఇది ఆంధ్ర రాష్ట్ర 6–గిగావాట్ డేటా సెంటర్ లక్ష్యాన్ని చేరుకోవడంలో కీలకం కానున్నాయి. ప్రభుత్వం చిన్న, మధ్య తరహా సంస్థలను కూడా ప్రోత్సహిస్తూ ప్రత్యేక ఆర్థిక మండలాలు, ఆవిష్కరణ కారిడార్లను అభివృద్ధి చేయాలి. వేగవంతమైన అనుమతులు, పన్ను రాయితీలు కల్పిస్తే అనేక సంస్థలు వచ్చే అవకాశాలు మెరుగుపడతాయి.

**3. సురక్షిత తాగునీరు**

వైజాగ్‌లో తాగునీటి కొరత ఒక ప్రధాన సమస్యగా ఉంది. మేఘాద్రిగడ్డ, ముదసర్లవ, రాయవాడ, తాటి పూడి, యేలేరు వంటి జలాశయాల నీటి వనరులను బలోపేతం చేయాలి. నీటి శుద్ధి కేంద్రాలను ఆధునీకరించి, పైప్‌లైన్ నష్టాలను తగ్గించి, సమాన పంపిణీని నిర్ధారించి అమలు చేయాలి. పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలలో తాగునీటి సదుపాయాలను పర్యవేక్షించి భద్రతను కల్పించాలి. అలాగే ప్రైవేటు కంపెనీల నీటి అవసరాలను గతంలో లాగా నిర్లక్ష్యం చేయకూడదు. ఇది ప్రజారోగ్యం, స్థిరమైన అభివృద్ధికి పునాది.

**4. పర్యాటక భద్రత, ప్రచారం**

వైజాగ్‌లోని సముద్ర తీరాలు, కొండలు, సాంస్కృతిక వారసత్వం పర్యాటకులకు ప్రధాన ఆకర్షణలు. భద్రతా లోపాలను గుర్తించి, ప్రముఖ పర్యాటక కేంద్రాలలో శిక్షణ పొందిన భద్రతా సిబ్బంది, రియల్–టైమ్ నిఘా వ్యవస్థలను మెరుగుపర్చాలి. బీచ్‌లు, పార్కులు, వారసత్వ ప్రదేశాల్లో మరుగుదొడ్లు, లైటింగ్, అత్యవసర ఆరోగ్య సదుపాయాలను మెరుగుపరచాలి. వైజాగ్ ను స్నేహపూర్వక తీర పర్యాటక గమ్యస్థానంగా ప్రచారం చేయాలి.

**5. నివాసయోగ్యమైన, సురక్షిత గృహాల అభివృద్ధి అవసరం**

అంతర్జాతీయ పెట్టుబడిదారులు, సంస్థలు, వృత్తి నిపుణులు పెరుగుతున్న నేపథ్యంలో ఆధునిక నివాస సదుపాయాల అవసరం పెరుగుతోంది. వైజాగ్‌లో పాత అపార్ట్‌మెంట్‌లు, వుడా భవనాలు, ప్రైవేట్ సొసైటీలు వంటి వాటిపై భద్రతా తనిఖీలు చేయాలి. కూలిపోవానికి సిద్ధంగా ఉన్న భవనాలపై గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ –జీవీఎంసీ దృష్టి పెట్టాలి. ముఖ్యంగా నగర నడిబొడ్డున సీతమ్మధార ప్రాంతంలో ఉన్న ఉడా హౌసింగ్ సొసైటీ నివాస సముదాయాలు, బీచ్ రోడ్డులో ఉన్న నివాస భవనాలు కూలిపోవటానికి సిద్ధంగా ఉన్నాయి. ఇలాంటి పాత ప్రైవేట్, భవనాలను పునరుద్ధరించి లేదా పునర్నిర్మించే దిశగా స్థానిక ప్రజలను, హౌసింగ్ సొసైటీ లను ప్రోత్సహించాలి. ప్రమాదకరమైన, దెబ్బతిన్న భవనాలను కూల్చి కొత్తగా నిర్మించటం అత్యవసరం. పచ్చదనం, సౌకర్యాలతో కూడిన హౌసింగ్ కాలనీలను అభివృద్ధి చేసే దిశగా ప్రైవేటు కంపెనీలను ప్రోత్సాహించాలి. గతంలో కొన్ని భవనాలు కూలిపోయి ప్రమాదాలు జరిగినప్పుడు జీవీఎంసీ వారికీ 400 వందలకు పైగా నోటీసులు ఇచ్చి ఆ గృహాలను పునర్నిర్మించాలని ఆదేశాలు జారీ చేసినా స్థానిక ప్రజలు అప్రమత్తం కాలేదు. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఈ విషయంలో హౌతగు చర్యలు తీసుకోవాలి. స్థానికులు కూడా విషయం తీవ్రతను గుర్తించి ప్రభుత్వముతో సహకరించి సురక్షిత నివాసాలను నిర్మించుకోవాలి. కొన్నిచోట్ల పాడైపోయిన భవనాలు మత్తు పదార్థాల వంటి అక్రమ కార్యకలాపాలకు కేంద్రాలుగా మారకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. గత రెండు వారాల్లో 15 కేసులు నమోదు కావటం గాంజా మత్తు పదార్థాల తీవ్రత ఏంటో తెలుసుస్తోంది. కొంతమంది గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పన్నుల సేకరణలో చూపే ఉత్సాహం, పౌరుల సమస్యల పరిష్కారంలో కూడా చూపాల్సిన ఆవశ్యకత ఉంది. సమయానుగుణంగా, సమగ్రంగా ఈ చర్యలు తీసుకుంటే, వైజాగ్ ప్రపంచ స్థాయి సంస్థలకు, వృత్తి నిపుణులు, వ్యాపారులు, పర్యాటకులకు ఆకర్షణీయమైన కేంద్రంగా మారుతుంది. దూరదృష్టి గల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో, కేంద్ర ప్రభుత్వ సహకారంతో, అంతర్జాతీయ భారీ పెట్టుబడులతో వైజాగ్ మార్పు దిశగా పయనిస్తోంది.

అయితే దీన్ని స్థిరంగా కొనసాగించడానికి మౌలిక వసతులు, సురక్షిత గృహాలు, నీరు, పర్యాటకం వంటి రంగాల్లో వేగవంతమైన, సమన్వయపూర్వక చర్యలు అవసరం. జివిఎంసిపై సమస్యలపై ముందస్తుగా వ్యవహరించి, ప్రజలకు తగిన సూచనలు చేసి, అమలుదిశగా ప్రయత్నిస్తే వైజాగ్ నిజమైన గ్లోబల్ నగరంగా ఉత్సాహభరితంగా, సురక్షితంగా, భవిష్యత్‌కు సిద్ధంగా మారనుంది.

# కరప మండలంలో పంట నష్టాలపై కన్నబాబు పరిశీలన



**కరప, (రాజధాని వార్తలు):** మొంథా తుఫాన్ ప్రభావంతో తీవ్ర నష్టాలు ఎదుర్కొన్న కరప మండలంలో యండమూరు, జి.భావవరం, సిరి పురం గ్రామాల్లో గురువారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్, కాకినాడ రూరల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో సమావేశమై పంటల నష్టాల పరిస్థితులను సమీక్షించారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని, వారికి ప్రభుత్వం తరపున అన్ని విధాల సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో సర్పంచులు, రొక్కాల గణేష్, కమిడి మంగాదేవి శంకర్, చింతా బుజ్జి, మాజీ సర్పంచ్ మారెళ్ళ రమణ, కాదా వెంకటేశ్వరరావు, నున్న వెంకటేశ్వరరావు, కరీం భాషా, గరగ సూరిబాబు, రొక్కాల తారకేశ్, సింగినీడి వెంకటేశ్వరరావు (నాని), నల్లా బాలాజీ, వజ్రపు కామేశ్వరరావు చెట్ల శేఖర్, చిన్నం వెంకటేశ్వరరావు (పండు), వనుం గంగారావు, రైతులు పాల్గొన్నారు.

# బాధితులకు నిత్యావసర సరుకులు, భోజనాలు అందజేసిన పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు 53వ డివిజన్ వెంకటేశ్వరపురం గాంధీ గిరిజన కాలనీలో డివిజన్ ఇన్‌చార్జ్ వెంగళ్ రెడ్డి ఆధ్వర్యంలో కోఆర్డినేటర్ పరంధామయ్య మరియు వైస్సార్సీపీ నాయకులు కార్యకర్తలతో కలిసి మొంథా తుఫాన్ కారణంగా ఇబ్బంది పడుతున్న గిరిజన కుటుంబాలకు నిత్యవసర వస్తువులు..మరియు ముంపు ప్రాంత నిర్వాసితులు అయిన 200 మందికి.. భోజనాలను .. వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా బాధితులకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని చంద్రశేఖర్ రెడ్డి తెలియజేశారు. అనంతరం స్థానిక మహిళలు పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని కలిసి.. తమ ప్రాంత ముంపు సమస్యకు.. శాశ్వత పరిష్కారం చూపే దిశగా.. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు.. ఆ ప్రాంతాన్ని చంద్రశేఖర్ రెడ్డి పరిశీలించి ముంపు సమస్య లేకుండా శాశ్వత పరిష్కారం లభించే దిశగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని స్థానికులకు హామీ ఇచ్చారు. పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మొంథా కారణంగా నెల్లూరు నగర నియోజకవర్గంలో అనేక ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. ముఖ్యంగా 53వ డివిజన్ గాంధీ గిరిజన కాలనీలో గిరిజనుల ఇళ్లలోకి నీరు చేరి వారికి తాగేందుకు మంచినీరు కూడ కరువైందన్నారు. ఈ పరిస్థితుల్లో తుఫాన్ కారణంగా ఇబ్బంది పడుతున్న సమయంలో బాదితులకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆహారం అందజేయడం జరిగిందన్నారు. ఈ రోజు గాంధీ గిరిజన కాలనీ బాధితును ఆదుకునే దిశగా.. డివిజన్ ఇంచార్జ్ వెంగల్ రెడ్డి ఆధ్వర్యంలో బాధిత ప్రజలకు బియ్యం తో పాటు 5 రకాల నిత్యవసర వస్తువులు కూడా అందజేయడం జరిగిందన్నారు.

రాజకీయాలకతీతంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎక్కడ ప్రజలు ఇబ్బంది పడుతున్న ముందుండి సేవలందిస్తుందని తెలిపారు. ప్రభుత్వం కూడా బాధితులకు అండగా నిలిచి వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్ర మంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పెర్నెటి కోటేశ్వర రెడ్డి, డివిజన్ నేతలు ప్రసన్న కుమార్, శరత్, 54 డివిజన్ వై సి పి నేతలు మస్తాన్, అస్లాం, సలాం మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్త్రీలకు మనోధైర్యమే ఆయుధం

**- సమాజానికి ఉత్తమ పౌరులు అందించడంలో స్త్రీల పాత్ర కీలకం - జీవితంలో ఒడిదుడుకులను ఓర్పుతో ఎదుర్కోవాలి - సహనం మహిళల పాలిట ఆభరణం : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఎవరో ఏదో అనుకుంటారని వెనుకడుగు వేసే స్వభావం వీడి మహిళలు అన్ని రంగాలలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారు. నెల్లూరు నగరంలోని టౌన్ హాల్లో శ్రీ పరంజ్యోతి స్త్రీ శక్తి అనే కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మహిళలను ఉద్దేశించి తమ అమూల్య సందేశాన్ని అందించారు. స్త్రీలు స్వతహాగా శక్తివంతులని తమలో అంతర్లీనంగా దాగి ఉన్న శక్తిని వెలికి తీసి ప్రపంచానికి చాటాలని కోరారు. కాపురాన్ని చెక్కబెడుతూ పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుతూ పెద్దల పట్ల గౌరవ మర్యాదలతో మహిళలు తమ ఔనత్యం చాటుకోవాలని కోరారు. సమాజానికి ఉత్తమ పౌరులు అందించడంలో స్త్రీల పాత్ర కీలకమన్నారు. జీవితంలో ఒడిదుడుకులను ఓర్పుతో ఎదుర్కోవాలని ఎటువంటి పరిస్థితులలో మనోధైర్యం కోల్పోకూడదని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి హితవు పలికారు. సహనం మహిళల పాలిట ఆభరణంమని మహిళలు ఆత్మభిమానంతో జీవించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలోసౌజన్య భగవత్ దాసాజి భారతి, అనిత, రమణయ్య, కిషోర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# డక్కిలి మండలం అంబేద్కర్ నగర్‌లో కోటి సంతకాల సేకరణ





**డక్కిలి, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లా డక్కిలి మండలం అంబేద్కర్ నగర్ గ్రామంలో గురువారం మెడికల్ కాలేజీలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డక్కేలు మండల అధ్యక్షులు చింతల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలను మోసం చేస్తూ పేద విద్యార్థులకు వైద్య,విద్య అందనంత దూరం చేస్తూ, పేద ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందుబాటులో లేకుండా ప్రజా ఆరోగ్య వ్యవస్థ క్షీణించి ప్రైవేట్ ఆస్పత్రులు ప్రజలను దోచుకునే అవకాశం కల్పిస్తున్న ఈ కూటమి ప్రభుత్వం పై గవర్నర్‌కి రాష్ట్రవ్యాప్తంగా కోటి సంతకాలతో కోటమీ ప్రభుత్వం చేస్తున్న మోసాలను తెలియపరచడమే వైయస్ జగన్మోహన్ రెడ్డి సంకల్పం అని తెలియజేశారు. ఈ సందర్భంగా వెంకటగిరి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులుగా నియామకమైన గానుగ వెంకటబాబు (అభిరామ్)ను వెంబులూరు పంచాయతీ సర్పంచ్ గానుగ చాముండేశ్వరి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకాపా మండల అధ్యక్షులు చింతల శ్రీనివాసులు రెడ్డి, ఉపాధ్యక్షులు, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు,అభిరామ్,నర్రవులు వేణుగోపాల్ నాయుడు, ఉపాధ్యక్షులు పొట్టేళ్ల వెంకటరమణ యాదవ్, డక్కిలి మురళి రెడ్డి,ముప్పాళ్ళ మురళి నాయుడు,నావూరు.పెంచల నరసింహులు (ప్రసాద్) మండల జనరల్ సెక్రెటరీ,భాస్కర్ నాయుడు, చంద్రయ్య నాయుడు,రవి నాయడు,శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

# "ప్రైవేటీకరణను వెనక్కి తీసుకోవాల్సిందే" - కాకాణి పూజిత









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సర్వేపల్లి నియోజకవర్గం, తోటపల్లి గూడూరు మండలం, ఈదూరు గ్రామంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు టంగుటూరు పద్మనాభరెడ్డి, తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించిన కోటి సంతకాల సేకరణకు భారీ స్పందన. పూజితమ్మతో ఫోటోలు దిగేందుకు ఉత్సాహం చూపించిన మహిళలు. తనను ఘనంగా స్వాగతించి, కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని జయప్రదం చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేసిన కాకాణి పూజిత. జగనన్న ఇచ్చిన ఒక్క పిలుపుతో, కూటమి ప్రభుత్వం తీసుకున్న మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ అనేకమంది కదిలి వచ్చి, స్వచ్ఛందంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. మెడికల్ కళాశాలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టి, చంద్రబాబు ప్రభుత్వం ప్రజల ఆస్తులను కొల్లగొట్టే ప్రయత్నం చేస్తుంది. పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం, వైద్య విద్యను పూర్తిగా దూరం చేయడానికి కూటమి ప్రభుత్వం పూనుకుంది. ప్రభుత్వ ఆసుపత్రులు, కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితిలో, పేదలకు వైద్యం అందించి, పేద ప్రజలు తమ ప్రాణాలను కాపాడుకునేందుకు దోహదపడ్డాయి. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో 17 మెడికల్ కళాశాలలో రాష్ట్రానికి తీసుకొని వచ్చి, 7 మెడికల్ కళాశాలల నిర్మాణాన్ని పూర్తిచేసి, ప్రారంభమైతే, మిగిలిన మెడికల్ కళాశాలలు వివిధ దశలలో పురోగతిలో ఉన్నాయి. వివిధ దశలలో పురోగతిలో ఉన్న 10 మెడికల్ కళాశాలలను చంద్రబాబు ప్రభుత్వం పూర్తి చేయలేక ప్రైవేట్ పరం చేస్తుంది. కూటమి ప్రభుత్వం కల్తీ మద్యాన్ని తీసుకుని వచ్చి, పేద ప్రజల ప్రాణాలను బలి తీసుకుంటూ, ప్రైవేటీకరణ నిర్ణయంతో పేదలకు వైద్య విద్యతోపాటు, నాణ్యమైన వైద్యాన్ని దూరం చేస్తోంది. కూటమి ప్రభుత్వం తీసుకున్న మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనుకకు తీసుకొని, పేదలకు వైద్య విద్యను అందించడంతో పాటు, నాణ్యమైన వైద్యాన్ని అందించాలని కోరుతున్నాం.

# "కోటి సంతకాలతో చంద్రబాబును అడ్డుకుంటాం" - కాకాణి









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సర్వేపల్లి నియోజకవర్గం, పొదలకూరు మండలం, బిరుదవోలు గ్రామంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ, వైయస్సార్సీపీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రివర్యులు మరియు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి. మాజీ ముఖ్యమంత్రివర్యులు వై.యస్.జగన్మోహన్ రెడ్డి చంద్రబాబు తీసుకున్న మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రజల నుండి సేకరించిన కోటి సంతకాలను జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర గవర్నర్‌కి వినతి పత్రం అందిస్తాం. చంద్రబాబు ప్రజలకు అనేక హామీలిచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఎగ్గొట్టడం సర్వసాధారణం. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పేదలకు రేషన్ అందించడానికి రేషన్ కార్డులు పంపిణీ చేస్తే, చంద్రబాబు రైతులకు యూరియా ఇవ్వనని చెప్పడానికి యూరియా కార్డులు పంపిణీ చేస్తున్నాడు. చంద్రబాబు పాలనలో తెలుగుదేశం పార్టీపై సానుభూతి కలిగిన రైతులు కూడా యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నారు. చంద్రబాబు యూరియా కార్డుల ద్వారా ఎంత మేరా, ఏ సమయంలో యూరియా అందిస్తుందో స్పష్టత ఇవ్వక పోవడంతో రైతులలో అయోమయ పరిస్థితి ఏర్పడింది. చంద్రబాబు హయాంలో ప్రతి ఏటా దిగుబడి తగ్గి, అప్పులపాలయ్యి, రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు ఏర్పడుతున్నా, చంద్రబాబు పట్టించుకోవడం లేదు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో, నేను మంత్రిగా రైతులకు సమృద్ధిగా యూరియా అందించాం. అధికారం ఉన్నా, లేకున్నా ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేసే నాయకుడు మన జగన్మోహన్ రెడ్డి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ భారీ వర్షాలకు ఉపాధి కోల్పోయిన పేదలకు రేషన్ పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నా, ప్రభుత్వం ప్రకటనలకే పరిమితమైంది. తుఫాను నేపథ్యంలో ప్రజలను ఆదుకోవడంలో విఫలమైన చంద్రబాబు ప్రభుత్వం, తన అనుకూల మీడియా ద్వారా తుఫాను చంద్రబాబుకు మోకరిల్లిందంటూ ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదం. చేయని పనులను సైతం తానే చేసినట్లు ప్రచారం చేసుకోవడంలో చంద్రబాబు దిట్ట. చంద్రబాబు, లోకేష్‌లు వంద జన్మలెత్తినా, మహానేత వై.యస్.రాజశేఖర్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి లాంటి నిజాయితీ, నిబద్ధత కలిగిన పాలనను ప్రజలకు అందించలేరు. అన్ని వర్గాల ప్రజలు జగన్మోహన్ రెడ్డి పరిపాలనను తిరిగి కోరుకుంటున్నారు. రైతులకు అవసరమైన యూరియా విషయంలో, ప్రభుత్వం నియమ నిబంధనలు పెట్టి, ఇబ్బందులకు గురిచేస్తే, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షాన నిలబడి పోరాటం చేస్తుంది. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రజలతో కలిసి పోరాటాలు చేసి, ప్రభుత్వం మెడలు వంచైనా సరే అడ్డుకుంటాం. భారీగా తరలివచ్చి, కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరున ధన్యవాదాలు.

# మాకు ఎంతో ఆప్తులు మాలేపాటి సుబ్బానాయుడు

**- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతమ్మ - పార్టీ అధికారంలో లేనిరోజుల్లోనే పార్టీని ఇక్కడ నిలబెట్టారు - ఇద్దరు మంచి లీడర్లను కోల్పోయాం - తమవంతు మద్దతు మాలేపాటి కుటుంబానికి ఎప్పుడూ ఉంటుంది**








**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఇటీవల ఆకస్మిక మృతి చెందిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవెలెప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు, భాను చందర్‌ల చిత్రపటాలకు నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు నివాళులు అర్పించారు. గురువారం మాలేపాటి సుబ్బానాయుడు, భాను చందర్ దశదిన కర్మలో పాల్గొన్న వేమిరెడ్డి దంపతులు.. ఈ సందర్భంగా ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఇలాంటి కార్యక్రమంలో పాల్గొనేందుకు దగదర్తి రావడం విచారకరమన్నారు. పార్టీ అధికారంలో లేనిరోజుల్లోనే పార్టీని నిలబెట్టారని చెప్పారు. పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడి పనిచేసిన ఇద్దరు మంచి నాయకులను కోల్పోవడం బాధాకరమన్నారు. మాలేపాటి సుబ్బానాయుడు తమకు ఎంతో ఆప్తులని, వారి మృతి తీరని లోటన్నారు. దగదర్తి మండల అధ్యక్షుడిగా, కావలి నియోజకవర్గ ఇన్ చార్జిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పార్టీకి, ప్రజలకు ఉత్తమ సేవలు అందించారని గుర్తు చేశారు. మాలేపాటి సుబ్బానాయుడు చివరి కార్యక్రమం మా కోవూరులో జరిగిందని గుర్తు చేశారు. పార్టీ కోసం క్రమశిక్షణతో పనిచేయడమే గాక మచ్చలేని నాయకుడిగా గుర్తింపు పొందారని, ఎంతో ఆప్యాయంగా ఉండే కుటుంబసభ్యుడిని కోల్పోయామన్నారు. సుబ్బానాయుడు కుటుంబానికి భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఖజానా కార్యాలయంలో కొత్త డిటి & ఏఓగా బి. శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరణ



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా ఖజానా కార్యాలయంలో నూతనంగా డిటి & ఏఓ బాధ్యతలు స్వీకరించిన గౌరవనీయ బి.శ్రీనివాసులుకి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము. ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థలో ఖజానా విభాగం కీలకమైన పాత్ర పోషిస్తున్నది. ఖజానా సిబ్బంది అందరి సమన్వయంతో, ప్రజా నిధుల పారదర్శక వినియోగం, సమయపాలన, బాధ్యతాయుత ఆర్థిక నిర్వహణలో శ్రీనివాసులు గారు మరింత నూతన దిశలో ముందుకు తీసుకువెళతారని విశ్వసిస్తున్నాము. ఆయనకు ఉన్న అనుభవం, నిబద్ధత, ప్రజాసేవా తపన ఖజానా విభాగానికి మరింత బలం చేకూరుస్తుంది. ఖజానా సిబ్బంది తరపున ఆయనకు ఈ కొత్త బాధ్యతలలో విజయం, ఆరోగ్యం, ఆనందం కలగాలని కోరుకుంటూ జిల్లా ఖజానా వ్యవహారాలు మరింత చక్కగా సాగేలా ఆయన నాయకత్వం మార్గదర్శకంగా నిలుస్తుందని సిబ్బంది తెలిపారు.

# సంపాదకీయం

## బిహార్ బాటలోనే దేశవ్యాప్త సర్

ఆ అస్తవ్యస్తత ఇప్పుడు ఒక పద్ధతిని సంతరించుకున్నది! బిహార్ అనంతరం తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో నవంబర్ 4 నుంచి అమలుపరచనున్న ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్%-% సర్) కార్యక్రమం గురించి నేను ప్రస్తావిస్తున్నాను. ప్రజాస్వామ్య నైతికత అయిన వయోజన ఓటుహక్కును విచక్షణా రహితంగా అత్యధిక ప్రజలకు తొలగించేందుకు మొరటు సాధనమైన 'సర్'ను ఇప్పుడు నాజూకు పద్ధతులతో విస్తరించేందుకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) పూనుకున్నది. అర్హులైన పౌరులకు ఓటుహక్కు తొలగింపు విషయమై నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు ఒక పదునైన సాధనంగా దాన్ని మార్చివేసింది. ఓటర్ జాబితాల ప్రత్యేక సవరణను తొట్ట తొలుత బిహార్‌లో అమలుపరిచిన తీరుతెన్నులు వివాదాస్పదమయ్యాయి. తీవ్ర గందరగోళం చోటుచేసుకున్నది. సవరించిన ఓటర్ జాబితాల్లో నిర్దుష్టత, కచ్చితత్వం మెరుగుపడకపోగా వివిధ కీలక అంశాల్లో నాణ్యత గణనీయంగా క్షీణించింది: వయోజన ఓటర్ల నిష్పత్తి (దీనినే ఓటర్లు - ప్రజల నిష్పత్తి అని కూడా అంటారు) బాగా పడిపోయిందిబీ మహిళా, ముస్లిం ఓటర్లు పెద్ద సంఖ్యలో తగ్గిపోయారుబీ ఎన్నికల సమగ్రత, నిష్పాక్షికతను దెబ్బతీసే అక్రమాలు (నకిలీ ఓటర్ల నమోదు, డజన్ల కొద్దీ ఓటర్ల చిరునామా ఒకటే కావడం) మొదలైనవి యథాప్రకారం కొనసాగాయి. మరి ఈసీఐ ఈ లోపాలు, లొసుగులను గుర్తించిందా? అక్టోబర్ 27న 'సర్' రెండో దశను ప్రకటించిన తీరును నిశితంగా గమనిస్తే బిహార్ అనుభవాల నుంచి భారత ఎన్నికల సంఘం సరైన పాఠాలు నేర్చుకోలేదని స్పష్టమవుతున్నది. అసలు తన పరంగా జరిగిన తప్పులు అంగీకరించలేని అశక్తత, సరిదిద్దుకునేందుకు సుముఖత భారత ఎన్నికల సంఘంలో కనిపించలేదు. ఇదొక కఠోర వాస్తవం. మరికొన్ని వాస్తవాలను కూడా మనం తప్పక పరిగణనలోకి తీసుకోవాలి. బిహార్‌లో 'సర్' అమలుకు ప్రభుత్వం వెచ్చించిన నిధులు భారీ పరిమాణంలో ఉండడం, అసెంబ్లీ ఎన్నికలు సమీపించిన తరుణంలో ఓటర్ జాబితాల సవరణ హడావుడిగా చేపట్టడం, తమ ఓటుహక్కును కాపాడుకోవడంలో పేద ఓటర్లకు ఎదురైన కష్ట నష్టాలు, మానసిక వ్యధలు మొదలైన వాటిని గమనిస్తే ఒక విషయం విశదమవుతుంది: ఓటర్ జాబితాల సవరణను ఏ విధంగా చేయకూడదో బిహార్ 'సర్' నిరూపించింది. భారత ఎన్నికల సంఘం ప్రకటించిన 'సర్' కొత్త వెర్షన్‌లో మార్పులు స్వతస్సిద్ధమైన ఒక కపట పథకాన్ని మరింత సమర్థంగా అమలుపరిచేందుకు ఉద్దేశించినవే. అవి సంక్లిష్టమైనవి మాత్రమే కాదు, స్పష్టంగా కనిపించని అదనపు అంశాలు సైతం వాటిలో ఉన్నాయి. బిహార్‌లో కంటే విశాల భారతదేశంలో మరింత పకడ్బందీగా తాను కోరుకున్న తీరులో 'సర్'ను అమలుపరిచేందుకు ఈసీఐ మెరుగ్గా సన్నద్ధమయిందనడంలో సందేహం లేదు. ఎన్నికల అధికారులకు 'సర్' అమలులో సకాలంలో శిక్షణ నిచ్చింది. నేమ్ మ్యాపింగ్ (ఒక పేరును గుర్తించేందుకు, సంధానం చేసేందుకు మరొక పేరుతో అనుబంధించే ప్రక్రియ)కు ఏర్పాట్లు చేసింది. పోలింగ్ బూత్ స్థాయి ఏజెంట్లు ఎన్యూమరేషన్ ఫామ్‌లు దాఖలు చేసేందుకు అనుమతించింది. దీనివల్ల పోలింగ్ బూత్ స్థాయి అధికారులకు పనిభారం తగ్గుతుంది. తద్వారా సవరణ ప్రక్రియ శీఘ్రగతిన జరిగేందుకు వెసులుబాటు అవుతుంది. బిహార్ 'సర్' అమలులో బహిరంగంగా ప్రకటించకుండా రహస్యంగా చేసిన కొన్ని మార్పులను ఈసీఐ ఇప్పుడు అధికారికమైనవిగా చేసింది. ఓటర్లు ఇప్పుడు తమ ఎన్యూమరేషన్ ఫామ్స్‌తో పాటు ఎలాంటి డాక్యుమెంట్లను సమర్పించనవసరం లేదు. ఈ మినహాయింపును 2002-04 నాటి పాత ఓటర్ జాబితాల్లో ఉన్న వారి సంతానానికి, లేదా 'బంధువు'కు కూడా వర్తింపజేసింది. తాత్కాలికంగా దూర ప్రదేశాల్లో ఉన్న వారి తరఫున ఎన్యూమరేషన్ ఫామ్స్ సమర్పించేందుకు సంబంధిత వ్యక్తుల కుటుంబ సభ్యులకు అనుమతినివ్వడం వలస వెళ్లిన వారికి ఉపశమనం కలిగిస్తుంది. కొత్త ఓటర్ల కోసం ఎన్యూమరేషన్ ఫామ్స్ తీసుకువెళ్లేందుకు పోలింగ్ బూత్ స్థాయి అధికారులను అనుమతించడం మంచిదే. అయితే ఇంటింటికీ తిరిగి ఓటర్లను ధ్రువీకరించుకునే దశలో తొలగింపులకు కాకుండా గణనీయమైన స్థాయిలో అదనపు చేర్పులకు తోడ్పడి తీరాలి. దీనివల్ల ఓటర్లకు ప్రయాసలు, ఎన్నికల అధికారులకు పనిభారం తగ్గుతాయి. ఇవన్నీ సానుకూల సంస్కరణలుగా కనిస్తున్నా లోపభూయిష్టమైన పథకాన్ని సమర్థంగా అమలుపరిచేందుకు ఉద్దేశించినవే అనడంలో సందేహం లేదు. చెప్పవచ్చినదేమిటంటే ఈ సడలింపులు, మెరుగుదలలు ఏవీ 'సర్'లో స్వతస్సిద్ధంగా ఉన్న ప్రాథమిక మినహాయింపు రూపకల్పనను మార్చవు. గతంలో ఎనిమిది పర్యాయాలు అమలుపరిచిన సమగ్ర సవరణ ప్రక్రియను పునరావృతం చేయడమే ప్రస్తుత ప్రత్యేక సమగ్ర సవరణ అని భారత ఎన్నికల సంఘం పదే పదే ఉద్ఘాటిస్తోంది. ఇదొక అబద్ధం. ప్రస్తుత 'సర్' గతంలో జరిగిన ఏ సమగ్ర సవరణ కంటే కూడా భిన్నమైనది. గత సమగ్ర సవరణల మార్గదర్శక సూత్రాలు పూర్తిగా భిన్నమైనవి. ఈసీఐ ఈ సత్యాన్ని కప్పిపుచ్చజాలదు. మరీ ముఖ్యంగా ఓటర్ జాబితాల్లో మళ్లీ స్థానం పొందేందుకు, అంటే ఓటర్‌గా తమను తాము ధ్రువీకరించుకునేందుకు అవసరమైన దరఖాస్తును, డాక్యుమెంట్లను ఓటర్లే స్వయంగా సమర్పించాలి. ఇది మన దేశంలో సార్వత్రిక వయోజన ఓటు హక్కు నిర్మాణ వ్యవస్థ (వయోజన పౌరులు ప్రతి ఒక్కరూ తమ సామాజిక, ఆర్థిక నేపథ్యంతో సంబంధం లేకుండా ఓటు వేయడానికి వీలు కల్పించే చట్టబద్ధమైన, విధానపరమైన చట్రం) ఒక మౌలిక మార్పు. ఇంతకు ముందు ఓటరు నమోదు బాధ్యత పూర్తిగా ప్రభుత్వంపైనే ఉండేది.

# రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయం, నిత్యావసర వస్తువులను రానున్న మూడు రోజులలో పంపిణీ చేయాలి : జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్



**అమలాపురం, (రాజధాని వార్తలు):** మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన వారికి తాత్కాలిక ఉపశమనంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయం, నిత్యవసర వస్తువులను రానున్న మూడు రోజులలో పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్ట రేట్ లో జిల్లా స్థాయి అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి మొంథా తుఫాన్ ఉపశమన చర్యలు, పంట నష్ట అంచనాలు రూపకల్పనపై సమీక్షించారు. పునరావాస కేంద్రాలలో నిత్యవసర వస్తువులైన ఉల్లిపా యలు, బంగాళ దుంపలు, కందిపప్పు, పామ్ ఆయిల్, పంచదార ప్యాక్ చేసి పంపిణీ చేయాలని 25 కేజీలు, బియ్యం మాత్రం చౌక ధరల దుకాణాల వద్ద పంపిణీ చేయాలన్నారు. అదేవిధంగా గత ఐదు రోజులుగా చేపల వేట కోల్పోయిన మత్స్యకారులకు, చేనేత రంగ కార్మికులకు 50 కేజీల చొప్పున బియ్యాన్ని ఈ పాస్ ఎనేబుల్ పద్ధతిలో ఉచితంగా సరఫరా చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా పునరావాస కేంద్రాలలో ఆశ్రయం పొందిన వారు సుమారు 30 వేల మంది వరకు ఉన్నారని వీరందరికీ ఆర్థిక సహాయం కుటుంబానికి రూ.3 వేలు ఒంటరి వ్యక్తులకు వెయ్యి చొప్పున అందించాల న్నారు. తీర ప్రాంత వ్యాప్తంగా 45 గ్రామాలలో సుమారు 30 వేల మత్స్యకార కుటుంబాలకు 50 కేజీలు బియ్యం సంబంధిత మత్స్య అభివృద్ధి కారుల జీవన భృతి కోల్పోయారనే ధ్రువీకరణ తో అదేవిధంగా చేనేత జౌళి శాఖ ధ్రువీకరణతో చేనేత రంగ కార్మి కులకు ఉచితంగా అందించాలన్నారు. మూడు రోజులలో తుఫాన్ ఉపశమన ప్రక్రియను సంబంధిత ప్రజాప్రతినిధుల భాగ స్వామ్యంతో ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవి ధంగా ఉపశమన పరిహారాలు అందించు ప్రక్రియలో స్థానిక తాసిల్దార్, ఎంపీడీవో సమన్వయం సహకారం పొంది పారదర్శకంగా బియ్యం నిత్యవసరాలు పంపిణీ చేయాలన్నారు. సముద్రపు తీర ప్రాంతంలో ఇతర జిల్లాల నుండి వలస వచ్చి తుఫాను మూలంగా జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారుల జీవన భృతికి ఉచితంగా బియ్యం అందించాలన్నారు. వ్యవసాయ ఉద్యాన శాఖలు పంట నష్టాలను అంచనా వేసి లెక్కించడానికి బృందాలను నియమించాలని ఆదేశించారు. పంట నష్ట అంచనాలు శాస్త్రయుక్తంగా వ్యవసాయ శాస్త్రజ్ఞుల నిబంధనలు పరిగణనలోకి తీసుకొని అంచనాలు వేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక అంచనాగా సుమారు 31 వేల ఎకరాలలో వరి పంట దెబ్బ తిందని గుర్తించినట్లు తెలిపారు.రెవెన్యూ గ్రామ వ్యవసాయ సహాయకులు, వ్యవసాయ అధికారులు, శాస్త్రజ్ఞుల ద్వారా బృందాలు నియమించి పంట నష్ట అంచనాలను రూపొందించాలన్నారు. పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులు కౌలుదారులకు మాత్రమే పరిహారం అందేలా చూడాలన్నారు. తుఫాను నేపథ్యంలో పశు సం వర్ధక శాఖ 50% రాయితీతో పశుదాన సరఫరా చేసేలా 800 టన్నులు సిద్ధం చేసిందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా తుఫాన్ కారణంగా దెబ్బ తిన్న పశు వైద్యశాలల డామేజ్లను అంచనా వేయాలన్నారు. అలాగే పశు ఔషధాలను గణించాలన్నారు. మత్స్య శాఖ ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలు జెట్టీలు, హర్బర్ల నష్టాలను అంచనా వేయాలన్నారు. గృహనిర్మాణ సంస్థ దెబ్బతిన్న గృహాల అంచనాలను రూపొందించాలన్నారు.జిల్లా గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య విభాగం సి పి డబ్ల్యూ ఎస్, సింగల్ విలేజ్ స్కీముల ఓవర్ హెడ్ ట్యాంకులు పైప్ లైన్లు, జనరేటర్లు వంటి నష్టాలను రూపొందించాలన్నారు. పంచాయితీరాజ్ ఇంజనీ రింగ్ శాఖ నష్టాలను రోడ్లు, వంతెనలు నిర్దేశిత ప్రొఫార్మాలో కిలోమీటర్ల వారీగా అంచనా వేయ లన్నారు. పాఠశాల విద్యాశాఖ 47 పాఠశాలల్లో దెబ్బతిన్న ఆటస్థలం, కాంపౌండ్ వాల్‌తో సహా ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ ఇంజనీర్ల ద్వారా అంచనాలు రూపొందించాలన్నారు. ఐ సి డి ఎస్ వారు అంగన్వాడీ కేంద్రాలు అంగన్వాడీ కార్యాలయాల డామేజీలపై నివేదికలో సమర్పించాలన్నారు. జల వనరుల శాఖ ఇంజనీర్లు లాకులు కాలువ గట్ల షట్టర్లు డామేజ్ పై నివేదికలు రూపొందించాలన్నారు. డ్రైనేజీ శాఖ ఇంజనీర్లు డ్రైనేజీలలో పూడికతీత షట్టర్ల రిపేర్లు డామేజ్‌లను లెక్కించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, పీహెచ్సీ సిహెచ్సి ఆరోగ్య కేంద్రాలు డామేజ్‌లను విద్యుత్ శాఖ కరెంటు స్తంభాలు ట్రాన్స్ఫార్మర్లు కండక్టర్లు డామేజీలను రూపొందించాలన్నారు. అధికా రులు తమ హెచ్ఓడీలకు జిల్లా కలెక్టర్ వారికి నివేదించే అంచనాలు ఒకే విధంగా ఇటువంటి వ్యత్యాసాలకు తావు లేకుండా సమర్పించాలని ఆయన స్పష్టం చేశారు. రానున్న ఐదు రోజులలో ఈ నివేదికలు రూపకల్పన చేసి సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు కే మాధవి పి శ్రీకర్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

**- పనుల అంచనాల నివేదిక రూపొందించేందుకు గ్రామంలో పర్యటించిన పంచాయతీరాజ్ అధికారులు - గ్రామంలో రహదారులు, డ్రైనేజ్ సిస్టం లేక ఇబ్బంది పడుతున్నామని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లిన గ్రామస్తులు - సీఎం చంద్రబాబు సూచనల మేరకు కలెక్టర్ ఆదేశాలతో గ్రామంలో పర్యటించిన అధికారులు**

**అల్లవరం, (రాజధాని వార్తలు):** మొంథా తుఫాన్ ప్రభావానికి గురైన అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవులో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన సమస్యలతో నిలిచిపోయిన పలు పనులకు మార్గం సుగమం చేసింది. గ్రామంలో మోకాళ్ళ లోతు గోతులతో ఉన్న రహదారులతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని, ముంపునిరు దిగేందుకు డ్రైన్ సౌకర్యం లేదని గ్రామంలో పర్యటించిన ముఖ్యమంత్రి దృష్టికి గ్రామస్తులు తీసుకువెళ్లారు. ప్రజల సమస్యలపై ముఖ్యమంత్రి ఓడలరేవు గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. దీంతో గ్రామంలో రహదారులు, డ్రైన్ల నిర్మాణానికి అంచనాల రూపొందించి పనులు ప్రారంభించే దిశగా నివేదిక సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. దీంతో పంచా యతీరాజ్ అధికారులు గురువారం గ్రామంలో పర్యటించి గ్రామస్తులతో చర్చించారు. వంతెన నుండి ఓఎన్జిసి టెర్మినల్ వరకు ఏడు మీటర్ల సిసి రహదారిని నిర్మించేందుకు ఉన్న అడ్డంకులను అధిగమించేందుకు, భారీ వర్షాలకు నివాస గృహాల చుట్టూ నిలిచిపోయే ముంపు నీరు దిగేందుకు రహ దారుల పొడవునా డ్రైన్ నిర్మాణానికి చేపట్టాల్సిన చర్యలపై గ్రామస్తులతో అధికారులు చర్చించారు. గ్రామంలో ముంపు నీరు దిగేందుకు



రహదారులు పొడవున తప్పనిసరిగా డ్రైన్ నిర్మాణం ఉండేలా నిర్మాణాలు చేపట్టాలని గ్రామస్తులు అధికారులను కోరారు. లేకపోతే ముంపు నీరు దిగే మార్గం లేక నెలల తరబడి గృహాలు ముంపులోని ఉంటున్నా యని అధికారులు దృష్టికి తీసుకు వెళ్లారు. పంచాయతీరాజ్ ఈ ఈ పి కృష్ణారెడ్డి, డి ఈ అన్యం రాంబాబు, డిఈ పి రాజ్ కుమార్‌లు గ్రామస్తులతో చర్చించి గ్రామంలో చేపట్టవలసిన పనుల జాబి తాను సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో మల్లాడి ఉమామహేశ్వరరావు, కొల్లు విష్ణుమూర్తి, పినపోతు రామకృష్ణ, కలిగితి సత్యనారాయణ, గుండుమేను శ్రీనివాసరావు, పెచ్చెట్టి రామకృష్ణ, పెచ్చెట్టి వెంకటే శ్వరరావు, కోలా బాబులు, కొప్పాడి రామకృష్ణ, చల్లంగి రాధాకృష్ణ, అంకాని మోహన్, అవనిగడ్డ సత్తిరాజు, అవనిగడ్డ వెంకటరాజు, చిలకలపూడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సాయినగర్ బాబా ఆలయం వద్ద పేద మహిళలకు చీరల పంపిణీ



**వేములవాడ, (రాజధాని వార్తలు):** మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దాతల సహకారంతో 1651 రోజులుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా గురువారం రోజున దాత అందించిన సహకారంతో సాయినగర్ బాబా ఆలయం వద్ద పేద మహిళలకు చీరల పంపిణీ అనంతరం లక్ష్మీ గణపతి రాజన్న భీమేశ్వర ఆలయం వద్ద పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని నేటి అన్నదాతలుగా మహమ్మద్ అబ్దుల్ రఫీక్ దంపతులు, డాక్టర్ జువ్వాడి వెంకటేశ్వ రరావు స్నేహాలత దంపతులు, ప్రతాప స్వప్న సంపత్ దంపతులు, నగుబోతు రవీందర్ జ్యోతి దంపతులు, గణాచారి మఠం శైలజ సాంబశివు దంపతులు, దేవరాజు ఉమ బాలచందర్ రాజు దంపతులు, రామడుగు శ్రీలత, కొడుకులు కోడళ్లు: ప్రజ్ఞ శరత్చంద్ర దంపతులు, శిరీష సాయిచంద్ర దంపతులు, శర్వాణి రవిచంద్ర దంపతులు, హైదరాబాద్ వాస్తవ్యులు చిన్నారులు శ్రీహర్ష, సాయికృష్ణ ఉన్నారని, ఒక్కపూట పేదలకు భోజనం అందించడానికి సహకారం అందించే దాతలు ట్రస్టు సభ్యులను గాని 9246939388 నంబరుకు సంప్రదించాలని ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మధు మహేష్, వొడ్యాల వేణు, సగ్గు రాహుల్ పసుల శ్రీధర్ పాల్గొన్నారు.

# టిడ్కో ఇళ్లు దక్కని వారికి రూ.27.75 లక్షలు చెల్లింపు




**అమలాపురం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పురపాలక సంఘం పరిధిలోని నివాస స్థలాలు లేని పేదలకు అల్లవరం మండలం బోడసకుర్రులో నిర్మించిన టిడ్కో ఇళ్లు రాక ఇళ్లు కోసం 8 ఏళ్ల క్రితం చెల్లించి సొమ్ములు రాక ఆర్థికంగా నష్టపోయిన బాధితులకు కూటమి ప్రభుత్వం సొమ్ములు తిరిగి చెల్లించింది. అమలాపురం పురపాలక సంఘ కార్యాలయంలో గురువారం టిడ్కో ఇల్లు రాని 30 మందికి బాధితులకు చెల్లించాల్సిన రూ. 27.75 లక్షల సొమ్ము చెక్కులను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఇళ్ళు రాక చెల్లించిన సొమ్ము తిరిగి రాక తాము గత వైసిపి ప్రభుత్వం కాలంలో కాళ్లు అరిగేలా తిరిగా మని కూటమి ప్రభుత్వం తమ గోడు విని తామ చెల్లించిన సొమ్ము తిరిగి చెల్లించిందని బాధితులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, కమిషనర్ వి నిర్మల్ కుమార్, కౌన్సిలర్ ఏడిద శ్రీను, తిక్కిరెడ్డి నేతాజీ, ఆశెట్టి ఆదిబాబు, జంగా అబ్బాయి వెంకన్న, భాస్కర్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గొడ్డటిపాలెం రైతులకు ఊరట

**- వరి పొలాల ముంపు కాలువల గుర్రపు డెక్క తొలగింపు**





**కరప, (రాజధాని వార్తలు):** తాజా తుఫాన్ ప్రభావంతో గొడ్డటిపాలెం గ్రామ పరిసరాల్లోని వరి పొలాలు ముంపుకు గురవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురైన విషయం తెలిసిన వెంటనే కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదేశాల మేరకు వ్యవసాయ, రెవిన్యూ అధికారులు సంయుక్తంగా గ్రామాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. రైతులు మురుగు కాలువ, గుర్రపు డెక్క కాలువల్లో నీటి మట్టం పెరగడం వల్ల పంటలు మునుగుతున్నాయని ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నానాజీ సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అధికారులు 24 గంటల్లోపే కాలువల్లో గడ్డిని, గుర్రపు డెక్కను తొలగించి నీటి ప్రవాహాన్ని సవ్యంగా జరిగేలా చేశారు. దీంతో వరి పొలాల నుంచి నీరు బయటకు వెళ్లి రైతులకు గణనీయమైన ఊరట లభించింది. తమ సమస్యను వెంటనే పరిష్కరించేందుకు స్పందించిన ఎమ్మెల్యే పంతం నానాజీకి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరప మండల జనసేన పార్టీ అధ్యక్షుడు బందారు మురళి, జనసేన వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ముద్రగడ రమేష్, అరట్లకట్ట గ్రామ కమిటీ అధ్యక్షుడు బత్తుల సతీష్, గొడ్డటిపాలెం గ్రామ కమిటీ అధ్యక్షుడు వీరమరెడ్డి ముత్యాలరావు, టిడిపి సీనియర్ నాయకులు సవరపు సత్తిబాబు, వీరభద్రరావు, నిమ్మకాయల సత్తిబాబు, అలాగే వ్యవసాయ, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

# పంట నష్టం నమోదు ప్రారంభం



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట మండలంలో మొంథా తుఫాన్ కారణంగా వరిపంట నష్టంపై నమోదు కార్యక్రమం ప్రారంభించినట్టు మండల వ్యవసాయ అధికారి వి మురళీధర్ అన్నారు. సామర్లకోట మండలంలో వరి పంట నష్టపోయిన పొలాలని గురువారం ఆయన పరిశీలించారు. ఉండూరు, జగ్గమ్మ గారి పేట, వేట్లపాలెం, జిమెడపాడు, భీమవరం ఈ గ్రామంలో ఆయన పర్యటించి ఇంతవరకు ప్రాథమికంగా వరి పంట నష్టపోయిన ఏరియా 12,855 ఎకరాలు ఉంటుందని గుర్తించారు. అలాగే పంట నష్టం నమోదు కూడా ఈరోజు నుంచి ప్రారంభించినట్టు ఆయన చెప్పారు. ఇంకా రైతుకు పంట నష్టం విధివిధానాలు రైతులకు వివరించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వేట్లపాలెం నుంచి గుమ్మళ్ళ రామకృష్ణ, జి మేడపాడు నుంచి పాలకుర్తి రవి, ఉండూరు నుండీ పేపకాయల సుబ్బారావు, రైతు సోదరులందరూ ఏఈవోలు రూప, కమల, వివిఎ లు, పలువురు రైతులు పాల్గొన్నారు.

# డాడ్ ఫ్రెండ్ ప్రోత్సాహంతో హీరోయిన్‌గా!



మాలీవుడ్ బ్యూటీ మమితా బైజు టాలీవుడ్ లో సినిమాలు చేయకముందే యువతలో ఫాలోయింగ్ సంపాదించిన బ్యూటీ. మాలీవుడ్ అనువాద చిత్రం ప్రేమలుతోనే బోలెడంత ఫేమస్ అయిపోయింది. అప్పటి నుంచి అమ్మడికి యువతలో మంచి క్రేజ్ ఏర్పడింది. ఇటీవల రిలీజ్ అయిన డ్యూడ్‌తోనూ మరో బ్లాక్ బస్టర్ అందుకుంది. ఇందులో అమ్మడు ప్రదీప్ రంగనాథ్ కు జోడీగా నటించి మెప్పించింది. ఈ సినిమా ఇప్పటికే 100 కోట్ల క్లబ్‌లో చేరింది. తమిళ సినిమా అయినా తెలుగు ప్రేక్షకులకు బ్రహ్మరథం పట్టడంతో ఇంత పెద్ద విజయం సాధ్యమైంది. దీంతో మమిత పేరు మరోసారి నెట్టింట ట్రెండింగ్‌లో నిలిచింది. ఇక తెలుగులో అవకాశాలు రావడం పెద్ద విషయం కాదు. ఇప్పటికే కొన్ని అవకాశాలు కూడా వచ్చినా రిజెక్ట్ చేసింది. నటనకు ఆస్కారం ఉన్న పాత్రలు మాత్రమే పోషించాలి అనే కండీషన్‌తో పని చేస్తుంది. ఈ నేపథ్యంలో గ్లామర్ పాత్రల్లో నటించే అవకాశాలను మమిత రిజెక్ట్ చేసినట్లు ప్రచారంలో ఉంది. అయితే ఈ బ్యూటీ గురించి తాజాగా ఓ ఇంట్రెస్టింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. మమితా బైజు తండ్రి డాక్టర్. సొంతంగా ఓ క్లినిక్ కూడా ఉంది. మమిత క్లినిక్‌కి వెళ్లిన సమయంలో బేబి డాక్టర్ అని పిలిచేవారట. రోగం నయం అయిన తర్వాత పేషెంట్లు తండ్రికి కృతజ్ఞతలు చెప్పడానికి వచ్చిన వారిని చూసి ఓ కుమార్తెగా తానెంతో గర్వపడేదాన్ని అన్నారు. ఆ కారణంతో తాను కూడా తండ్రిలా డాక్టర్ అవ్వాలని కలలు కనేదట. కానీ అనుకోకుండా సినిమాల్లోకి రావడంతో ఆ కల చెదిరిపోయిందంది. 9వ తరగతి చదువుకుంటోన్న సమయంలో సర్వోపరి బాలక్కాన్ సినిమాలో నటించే అవకాశం వచ్చిందిట. ఆ చిత్రాన్ని నిర్మించేది కూడా తండ్రి స్నేహితుడు కావడంతో అవకాశం ఈజీగా వచ్చిందంది. ఆ సినిమా తర్వాత ఆడిషన్ కు వెళ్లమని ప్రోత్సహించేవారుట. అలా వెళ్లడం సహా తొలి సినిమా రిలీజ్ అనంతరం చాలా అవకాశాలు వచ్చాయంది. అలా నెమ్మదిగా నటన అలవాటుగా మారిందంది. నటనంటే చిరాకు పడే మమితా నటనపై ఇష్టం పెంచుకున్నట్లు తెలిపింది. కాలక్రమంలో మ్యాకప్ అలవాటుగా మారడంతో ఇంట్లో ఉన్న సమ యంలో కూడా అప్పుడప్పుడు మ్యాకప్ వేసుకునేదట. అప్పటి నుంచి నటిగా స్థిరపడాలి అనే ఆలోచనతోనే ప్రయాణం మొదలు పెట్టినట్లు తెలిపింది. ఈ బ్యూటీ ఇప్పటి వరకూ మాలీవుడ్‌లోనే ఎక్కువ సినిమాలు చేసింది. తమిళ్‌లో రెండు..మూడు సినిమాలు చేసింది. ప్రస్తుతం దళపతి విజయ్ హీరోగా నటిస్తోన్న జన నాయగన్ లోనూ నటిస్తోంది.

# ట్రంప్ ట్వీట్‌ని పబ్లిసిటీకి వాడిన అడివి శేష్..!



కాదేది కవితకు అనర్హం అని అన్నట్టుగా కాదేది సినిమా పబ్లిసిటీకి అనర్హం అని మన తెలుగు యాక్టర్స్ చెబుతున్నారు. వాళ్ల వాడకం ఎలా ఉంది అంటే ఏకంగా సినిమా ప్రమోషన్ కోసం అమెరికా ప్రెసిడెంట్‌ని కూడా వాడుతున్నారు. సినిమాను జనాల్లోకి తీసుకెళ్లడం కోసం ఎలాంటి ప్లాట్ ఫాంని వదలట్లేదు యాక్టర్స్. ఇంతకీ విషయం ఏంటంటే టాలీవుడ్ యంగ్ హీరో అడివి శేష్ లేటెస్ట్‌గా అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ ట్వీట్‌ని తన సినిమా ప్రమోషన్స్‌కి వాడుకున్నాడు. ట్రంప్ జీ2 కన్వినింగ్ ట్వీట్.. ట్రంప్ త్వరలో జీ 2 కన్వినింగ్ ఉంటుందని ఎక్స్ లో పెట్టగా దానికి అడివి శేష్.. జీ 2 మాసివ్ ముందు డెకాయిట్ ఎక్స్ ప్లోషన్ ఉందని రిప్లై ఇచ్చాడు.


అడివి శెష్ ఇచ్చిన రిప్లై ట్రంప్ చూసే ఛాన్స్ ఉండకపోవచ్చు కానీ జీ 2 అని ట్రంప్ పెట్టింది అది గూఢచారి 2 అన్నట్టు తను ఫీలి ఇలా డెకాయిట్, జీ 2ల ప్రమోషన్ ని ట్రంప్ ట్వీట్ ద్వాకా వాడటం అది కేవలం అడివి శేష్ వల్లే అయ్యింది. అడివి శేష్ ప్రస్తుతం రెండు సినిమాలు చేస్తున్నాడు. అందులో ఒకటి డెకాయిట్ కాగా.. మరొకటి జీ2 అదే గూఢచారి 2. డెకాయిట్ ఒక లవ్ స్టోరీ విత్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా రాబోతుంది. ఈ సినిమాను షానీల్ డియో డైరెక్ట్ చేస్తున్నారు. మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమా అసలైతే డిసెంబర్ 25 క్రిస్మస్ కి రిలీజ్ అనుకున్నారు కానీ ఇప్పుడు ఆ సినిమాను మార్చి 19కి రిలీజ్ వాయిదా వేశారు. ఇక అడివి శేష్ అండ్ టీం గూఢచారి సీక్వెల్‌గా జి2 కోసం రెండేళ్లుగా షూటింగ్ చేస్తూనే ఉన్నారు. తెలుగు తెర మీద పర్ఫెక్ట్ రా ఏజెంట్ మూవీని చూపించేలా వారి ప్రయత్నాలు జరుగుతున్నాయి. జీ 2 సినిమాలో వామిక గబ్బి హీరోయిన్‌గా నటిస్తుంది. ఈ రెండు సినిమాలు కూడా నెక్ట్స్ ఇయర్ రిలీజ్ కాబోతున్నాయి. అడివి శేష్ సినిమాలు ఆడియన్స్‌ని ఇంప్రెస్ చేస్తాయి. కానీ సినిమా సినిమాకు అతను తీసుకునే టైం ఆడియన్స్‌కి ఇబ్బంది కలిగిస్తుంది. ఐతే టైం తీసుకున్నా సరే మంచి అవుట్ పుట్‌తో ఆడియన్స్‌ని మెప్పించాలని ప్రయత్నిస్తాడు అడివి శేష్. మరి డెకాయిట్, జీ 2 ఈ రెండు సినిమాలతో అడివి శేష్ ఎలాంటి రిజల్ట్ అందుకుంటాడో చూడాలి. ఈమధ్య సినిమా తీయడం కన్నా ఆ సినిమా గురించి ఆడియన్స్‌లో డిస్కషన్ ఉండేలా చేయడం పెద్ద పనిగా మారింది. అందుకే మేకర్స్ సినిమా తీయడమే కాదు ప్రమోషన్స్ విషయంలో కూడా సీరియస్ ప్లానింగ్‌తో వస్తున్నారు. ఎలా అయితే అడివి శేష్ ట్రంప్ ట్వీట్‌కి సంబంధం లేకపోయినా కామెంట్ పెట్టాడో అలా సినిమాకు రిలేటెడ్ అయినా కాకపోయినా సందర్భాన్ని వాడుకోవాలని ఫిక్స్ అయ్యారు.

# దేశాన్ని ఒక్కటి చేసిన ఘనత ఆయనకే సాధ్యం



ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్రీయ ఏక్తా దివస్ వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవి, డిజిపి బి.శివధర్ రెడ్డి, పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్‌లు పాల్గొన్నారు. అలా హైదరాబాదులో జరిగిన రన్ ఫర్ యూనిటీ కార్యక్రమంలో ఈ ముగ్గురు భాగమయ్యారు. ఇక ఈ కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ.. ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ కి మొదట నివాళులర్పించారు. ఆ తర్వాత సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ సమైక్యత సందేశం ప్రాముఖ్యతను హైలైట్ చేస్తూ మాట్లాడారు. చిరంజీవి మాట్లాడుతూ.. "సర్దార్ వల్లభాయ్ పటేల్ భిన్నత్వంలో ఏకత్వం అని చెప్పేవారు. ఇది ఆయన ఇచ్చిన ఒక మంచి సందేశం.. 560 ముక్కలైన భారతదేశాన్ని ఒక్కటిగా కలిపిన ఘనత సర్దార్ వల్లభాయ్ పటేల్‌దే.. ఆయన వల్లే మనం ఇప్పుడు అందరం ఒక్కటిగా ఉన్నాం. ఆయన ఇచ్చిన విజన్ వల్లే దేశం ఇలా ఉంది. మనం ఆయన ఇచ్చిన భిన్నత్వంలో ఏకత్వం అనే సందేశాన్ని పాటిస్తున్నాం. ఇలాంటి యువత ఇన్స్పైర్ అయ్యే కార్యక్రమాలు హైదరాబాద్ పోలీసులు చేయడం నిజంగా దేశానికి గర్వకారణం.. హైదరాబాదులో ఇలాంటి కార్యక్రమాలు చేయడం..దీనిలో నాలాంటి వ్యక్తిని భాగస్వామ్యం చేయడం చాలా ఆనందంగా ఉంది"..అంటూ చిరంజీవి చెప్పుకొచ్చారు. అలాగే ప్రతి యువత సర్దార్ వల్లభాయ్ పటేల్ ని స్ఫూర్తిగా తీసుకోవాలి.సర్దార్ పటేల్ మన దేశానికి ఇచ్చిన ఏకత్వం.. వన్ నేషన్.. ఐక్యత.. ఎందుకంటే మనది వైవిధ్యభరితమైన దేశం.... విభిన్న భాషలు, విభిన్న వంటకాలు, సంస్కృతి ఉన్నాయి.అయినప్పటికీ మనం ఒక్కటిగా ఉన్నాం... ఆ ప్రేరణకు మూలం భారతదేశ ఉక్కు మనిషి సర్దార్ పటేల్.ఇలాంటి వేడుకలు హైదరాబాద్ పోలీసులు ఇంకా మరెన్నో జరపాలని కోరుకుంటున్నాను.. ఇందులో నన్ను కూడా భాగం చేసినందుకు ధన్యవాదాలు అంటూ చిరంజీవి చెప్పుకొచ్చారు. ఇక సర్ధార్ వల్లభాయ్ పటేల్ జయంతిని రాష్ట్రీయ ఏక్తా దివస్ అని పిలుస్తారు. అలా అక్టోబర్ 31న దేశవ్యాప్తంగా దీన్ని ఒక పండగలాగా జరుపుకుంటారు. భారతదేశ అత్యంత సాహసోపేత స్వాతంత్ర్య సమరయోధులలో ఒకరిగా పటేల్ని గౌరవిస్తారు. ఇక రన్ ఫర్ యూనిటీ కార్యక్రమంలో చిరంజీవి తన డీప్ ఫేక్ వీడియోలు, ఫోటోల గురించి కూడా స్పందించారు.. తెలంగాణ రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ చాలా పటిష్టంగా ఉంది.. ప్రజలకు ఎలాంటి అవసరం వచ్చినా.. ఆపద వచ్చినా.. పోలీసులు మేము ఉన్నాం అంటూ వారికి తోడునీడగా నిలుస్తూ రక్షిస్తున్నారు. ఇక ఈ మధ్యనే నాకు సంబంధించి కొన్ని డీప్ ఫేక్ వీడియోలు వైరల్ అయ్యాయి.అశ్లీల వెబ్సైట్ లో నాకు సంబంధించిన డీప్ ఫేక్ వీడియోలు,ఫోటోలు క్రియేట్ చేశారు. ఇక ఈ డీప్ ఫేక్ క్రియేటెడ్ వీడియోలపై పోలీసులకు ఫిర్యాదు చేయగా తెలంగాణ పోలీసులు చాలా తొందరగా చర్యలు తీసుకున్నారు. డీప్ ఫేక్ అనేది ఒక గొడ్డలి పెట్టు లాగా మారిపోయింది.ఇప్పటికే ఈ డీప్ ఫేక్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు తెలియజేశాను. ఈ డీప్ ఫేక్ విషయాన్ని సిపి సజ్జనార్, డిజిపి ఇద్దరు చాలా సీరియస్‌గా తీసుకున్నారు. పెరుగుతున్న టెక్నాలజీని ఆహ్వానించాలి కానీ ఇలాంటి వాటిని ప్రోత్సహించకూడదు. సైబర్ నేరగాళ్లకు, డీప్ ఫేక్ చేసేవాళ్లకు అస్సలు భయపడకూడదు వెంటనే పోలీసులను సంప్రదించాలి.. గవర్నమెంట్ కూడా వీటిపై ప్రత్యేకమైన చట్టం తీసుకురావాలని కోరుతున్నాను. ఈ టెక్నాలజీ వల్ల కొంత లాభం,కొంత నష్టం జరుగుతుంది కాబట్టి భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు ఉంటాయి. అందుకే వీటిపై కఠిన చర్యలు తీసుకోవాలి అంటూ చిరంజీవి చెప్పుకొచ్చారు.

# సక్సెస్ అయితే సీనియర్లకు మంచి ఆప్షనే!



సీనియర్ హీరోలకు హీరోయిన్లు ఎంపిక అన్నది ఎంత కష్టంగా మారుతుందో చెప్పాల్సిన పనిలేదు. చిరంజీవి, నాగార్జున, బాలకృష్ణ, వెంకటేష్ లాంటి స్టార్లకు హీరోయిన్లు సెట్ చేయడం ప్రతీసారి సమస్యగా మారుతోంది. దీంతో తీసుకున్న వారినే మళ్లీ మళ్లీ తీసుకోవాల్సి వస్తోంది. ఈ క్రమంలో నయనతార, త్రిషలనే రిపీట్ చేయాల్సిన సన్నివేశం ప్రతీసారి కనిపిస్తోంది. అనుష్కలాంటి 40 ఏళ్లు దాటి నటి ఉన్నా? దర్శకులు ఎందుకనో ఆమెవైపు చూడటం లేదు. మిల్కీ బ్యూటీ తమన్నా కూడా సీరియర్లకు సై అంటున్నా ఆమెని కూడా అశ్రద్ధ చేస్తున్నారు. ఆషీకా రంగనాథ్, సంయుక్తా మీనన్‌లాంటి వారు మరిన్ని సక్సస్‌లు అందుకుంటే సీనియర్లకు సరితూగుతారు. ప్రస్తుతం ఈ భామలు సీనియర్లతో కొన్ని సినిమాలు చేస్తోన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వాళ్ల సరసన చేరడానికి కన్నడిగి శ్రీనిధి శెట్టి కూడా సిద్దంగా ఉంది. విక్టరీ వెంకటేష్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రంలో శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా ఎంపికైన సంగతి తెలిసిందే. గురూజీ చాలా మంది భామల్ని పరిశీలించి చివరిగా ఆ ఛాన్స్ శెట్టి బ్యూటీకి ఇచ్చారు. ఈ బ్యూటీ తెలుగింట ఇప్పుడిప్పుడే ఫేమస్ అవుతుంది. ఇటీవల రిలీజ్ అయిన హిట్ 3తో మంచి హిట్ అందుకున్న సంగతి తెలిసిందే. ఈ అమ్మడు కూడా అందాల ఆరబోత కంటే నటనకు ఆస్కారం ఉన్న పాత్రలే చేస్తుంది. గురూజీ సినిమాల్లో హీరోయిన్ల పాత్రలకు పెద్ద పీట వేస్తారు. హీరోకు ధీటుగా హీరోయిన్ పాత్రలను డిజైన్ చేస్తారు. శ్రీనిధి పెర్ఫార్మర్ కావడంతో ఏరికోరి మరీ ఎంపిక చేసారు. ఆయన చేతుల్లో పడ్డ హీరోయిన్లు కూడా వెలుగులోకి వచ్చారు. ఈ సినిమా హిట్ అయితే గనుక శ్రీనిధికి మంచి పేరు వస్తుంది. అవకాశాలు పెరుగుతాయి. యువ హీరోలతో పాటు, సీనియర్ హీరోలకు శ్రీనిధి మంచి ఆప్షన్‌గా మారుతుంది. కెరీర్ పరంగా శ్రీనిధి గురూజీ ఇచ్చిన అవకాశాన్ని గొప్పగా భావిస్తోంది. ఇతర భాషల్లో కొన్ని చిత్రాల్లో గ్లామర్ పాత్రల్లో నటించాలని చాలా అవకాశాలు వచ్చినా శ్రీనిధి వాటిని సున్నితంగా తిరస్కరించింది. ప్రస్తుతం తెలుగు సినిమాలపై దృష్టి పెట్టి పని చేస్తోంది.

# అంగరంగ వైభవంగా గోపాష్టమి వేడుకలల్లో పాల్గొన్న జడ్పీ చైర్ పర్సన్ కుటుంబం





**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరంలోని తన నివాసమైన సిరి సహస్ర రైజింగ్ ప్యాలెస్‌లో కార్తీక మాస గోపాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా గురువారం నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్పర్సన్, వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు మరియు భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త గౌరవనీయులు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ఆయన సతీమణి మజ్జి పుష్పాంజలి, అల్లుడు ప్రదీప్ నాయుడు, కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ గోపాష్టమి వేడుకలులో పాల్గొని శ్రీకృష్ణుని విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. హిందువులకు అత్యంత ప్రీతిపాత్రమైన గోపాష్టమి వేడుకలు నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

# నవంబర్ 12న షాపింగ్ కాంప్లెక్స్ 11 షాపులకు బహిరంగ వేలం

**భీమునిపట్నం, (రాజధాని వార్తలు):** మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ, జోన్-1, భీమిలి పరిధిలో నున్న పెద్ద బజారు, భీమునిపట్నం నందు నూతనంగా నిర్మించిన భీమునిపట్నం షాపింగ్ కాంప్లెక్స్ నందు గల 11 షాపులకు గాను ఇచ్చిన తేదీ నుండి 3 సం.ల కాలమునకు నవంబర్ 12 వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు భీమిలి జోనల్ కమిషనర్ వి. అయ్యప్ప నాయుడు ఒక ప్రకటనలో తెలియచేసారు. 12 న జోనల్ కమీషనరు వారి ద్వారా గాని, వారి అనుమతి పొందిన వారి ద్వారా గాని, భీమునిపట్నం జోన్-1 జోనల్ కార్యాలయం నందు జి.వి.ఎమ్.సి. గజిట్ నోటిఫికేషన్ నందలి నియమ నిబంధనల ప్రకారము బహిరంగ వేలం నిర్వహించబడునని తెలిపారు. కావున ఆశక్తిగల వారు సదరు వేలం నందు రూ.48,000/- లకు కమీషనరు, జి.వి.ఎమ్.సి. వారి పేరున డిమాండ్ డ్రాఫ్ట్‌తో పాటు వేలం పాటలో పాల్గొనే వారి యొక్క ఆధార్ కార్డు జెరాక్స్ మరియు పాన్ కార్డు జెరాక్స్ తో పాల్గొనవలసినదిగాను మరియు ఇతర



వివరములు ఈ కార్యాలయం పనిచేయు వేళలలో సంబంధిత విభాగపు అధికారులను సంప్రదించవలసినదిగా కోరుతున్నారు.

# పంట నష్టాన్ని అంచనా వేయాలి : మంత్రి సంధ్యారాణి



**మక్కువ, (రాజధాని వార్తలు):** పంట నష్టాన్ని తక్షణమే అంచనా వేయాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మరియు గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని సంబర శంబర గ్రామ సమీపంలో ఉన్న వెంగళరాయ సాగర్ జలాశయాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం కారణంగా జలాశయం వద్ద పటిష్టమైన బందోబస్తు నిర్వహించాలన్నారు. ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జలాశయ ఇన్ఫ్లో అవుట్ ఫ్లో వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. రైతులకు పంట నష్టం వాటిల్లిన పంటను తక్షణ నమోదు చేయాలన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. వర్షానికి తడిసిన మొక్కజొన్న కొనుగోలు చేసేందుకు అధికారులతో మాట్లాడి తగిన ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. అలాగే కార్యకర్తలను సహాయ చర్యలు స్వచ్ఛందంగా పాల్గొవాలని పిలుపునిచ్చారు.

# మొంథా తుఫాను బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ : తహసిల్దార్ డోలా రాజేశ్వరరావు

**- తహసిల్దార్ డోలా రాజేశ్వరరావు, గ్రామ సర్పంచ్ తాళ్లపూడి కీర్తి చేతుల మీదుగా పంపిణీ**



**గజపతినగరం/ బొండపల్లి, (రాజధాని వార్తలు):** మండలంలోని నెలివాడ గ్రామములో మొంథా తుఫాను కారణంగా నిరాశ్రయులైన బాధితులకు తహసిల్దార్ డోల రాజేశ్వరరావు, గ్రామ సర్పంచ్ తాళ్లపూడి కీర్తి చేతుల మీదుగా గురువారం నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు, సర్పంచ్ తాళ్లపూడి కీర్తి మాట్లాడుతూ నిరాశ్రయులైన మూడు కుటుంబాలకు ఈ నిత్యవసర సరుకులను పంపిణీ చేస్తున్నట్లు తెలియజేశారు. జీవో నెంబర్ 115 ప్రకారము ఒక్కొక్క కుటుంబానికి 25 కేజీల బియ్యం, ఒక కిలో కందిపప్పు, ఒక కిలో ఉల్లిపాయలు, ఒక లీటర్ ఆయిల్ ప్యాకెట్, ఒక కేజీ బంగాళాదుంపలు, ఒక కేజీ పంచదార చొప్పున ఆరు రకాలైన నిత్యావసర సరుకులను రిహాబిలిటేషన్ సెంటర్ నందు పంపిణీ చేయడం జరిగిందని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వైకుంఠపు రాజేశ్వరరావు, సివిల్ సప్లై డి.టి కందుల తిరుపతిరావు, స్థానిక ఎంపీటీసీ కొమ్ము నాగమణి, నెలివాడ గ్రామ వైకాపా నాయకులు తాళ్లపూడి అప్పలనాయుడు, కెరటాం గ్రామ నాయకులు బుజ్జిరాజు, వీఆర్వో బోని సత్యనారాయణ, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# వర్షాల ప్రభావాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి

**రేగిడి ఆమదాలవలస, (విజయనగరం), (రాజధాని వార్తలు):** మొంథా తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షాల ప్రభావాన్ని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి గురువారం పరిశీలించారు. ఆయన గురువారం రాజాం నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన జరిపారు. రహదారులను, పంట పొలాలను, నీటి ప్రవాహాలను పరిశీలించారు. రేగిడి ఆమదాలవలస మండలం సంకిలి బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నాగావళి నదిని పరిశీలించారు. నది ప్రవాహం, దిగువనున్న ప్రాంతాలు, పంట పొలాల పరిస్థితిని తెలుసుకున్నారు. నష్ట నివారణా చర్యలు తీసుకోవాలని, పరివాహక ప్రాంతాల ప్రజలను హెచ్చరించాలని కలెక్టర్ ఆదేశించారు. రాజాం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ పర్యటనలో ఆర్డీవో జీ.వి.సత్యవాణి, తహసీల్దార్ కృష్ణ లత, ఇతర రెవెన్యూ



అధికారులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

# "సుగుణాకర్" సేవలు మరువలేనివి

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తూ ఎంపీడీవోగా పదోన్నతిపై వెళ్తున్న చల్లా సుగుణాకర్ రావు సేవలు మరువలేని వని స్థానిక ఎంపీడీవో బి.కళ్యాణి అన్నారు. పదోన్నతి పై వెళ్తున్న సుగుణాకర్రావును గురువారం కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, కార్యదర్శులు, ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డిప్యూటీ ఎండిఓగా గజపతినగరం మండలంలో అంకితభావంతో పనిచేసి, ప్రజలు మన్ననలు పొందరన్నారు. కార్యదర్శులు పూలమాలలు, దుస్సాలువాలతో ఘనంగా సత్కరిం చారు. ఈ కార్యక్రమంలో



ఏవో పుష్పలత, ఈవో జనార్దన్ రావు, సర్పంచ్ బెల్లాన త్రినాధరావు ,ఏపీఓ కృష్ణవేణి, మంత్రి రమణ, మండల కార్యదర్శులు, ఉపాధి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# భూసేకరణకు సంబంధించిన పనులన్నీ వేగవంతం కావాలి : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లాలో పలు ప్రోజెక్టుల కోసం చేపడుతున్న భూసేకరణకు సంబంధించిన అవార్డ్ పాస్ చేయడం, సంబంధిత అధికారులకు లేఖలు రాయడం, ఇతర ప్రాసెస్సింగ్ వేగవంతం కావాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తెలిపారు. గురువారం ముగ్గురు ఆర్.డి.ఓలతో కలెక్టర్ తన ఛాంబర్లో భూసేకరణ పై సమీక్షించారు. జాతీయ రహదారుల, భోగాపురం ఎయిర్పోర్ట్, ట్రైబల్ యూనివర్సిటీ, రెల్లి వద్ద గ్రేహౌండ్స్ కి కేటాయించిన భూమి, ఎం.ఎస్.ఎం.ఈ ల కోసం భూసేకరణ, మురునీరు ట్రీట్మెంట్ ప్లాంట్‌కు, రైతు బజార్, విజయనగరం డిగ్రీ కళాశాలకు వేణుగోపాలపురం వద్ద కేటాయించిన భూమి, నియోజకవర్గ పరిధిలో ఒక డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు తదితర ప్రోజెక్టులకు భూసేకరణ సమస్యలపై ఆర్.డి.ఓలతో చర్చించినారు. టైం లైన్ లోపల పనులు పూర్తి కావాలని, పెండింగ్ లేకుండా త్వరగా పరిష్కరించుకోవాలని అదేశించారు. ఈ సమావేశంలో జె.సి సేదు మాధవన్, ఆర్.డి.ఓలు కీర్తి, రామ్మోహన్, సత్యవాణి, సూపరింటెండెంట్‌లు గోవింద, సూర్యలక్ష్మి పాల్గొన్నారు.

# మొంధా తుఫాన్ బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, అయినవిల్లి, (రాజధాని వార్తలు):** అయినవిల్లి మండలంలోని నల్లచెరువు గ్రామం లో మొంథా తుఫాన్ కారణంగా దెబ్బతిన్న గృహాలు, వరి పొలాలను పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తుఫాన్ వల్ల గృహాలు కోల్పోయిన కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న నష్టపరిహారం వెంటనే అందేలా చూడాలని, అలాగే రైతులు ఎదుర్కొన్న నష్టాన్ని పూర్తిగా అంచనా వేసి వారికి తగిన పరిహారం అందించాలని ఎమ్మెల్యే కోరారు. అదే సమయం లో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఇప్పటికే గృహాలు, వరి పొలాలకు నష్టపరిహారం ప్రకటించిందని, ఆ సహాయాన్ని బాధితులకు త్వరగా చేరేలా చర్యలు వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని వృద్ధ వికలాంగుడు తనకు హౌసింగ్ లోన్ మంజూరు చేయాలని ఎమ్మెల్యే గని కోరాడు. వెంటనే స్పందించిన గిడ్డి సత్యనారాయణ సంబంధిత అధికారులతో మాట్లాడి, బాధితుడికి తక్షణమే న్యాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలిశెట్టి రాజేష్, సత్తిబాబు, వర్రే శేషు కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# తుఫాను సహాయక చర్యల్లో పాల్గొన్న వైఎస్ఆర్సిపి కార్యకర్తలు


**మక్కువ, (రాజధాని వార్తలు):** మొంత తుఫాన్ గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మక్కువ మండలం కవిరపల్లి గ్రామం గోముకి నదిపై ఉన్నటువంటి బ్రిడ్జి పైనుంచి నీరు ప్రవహించడంతో రెండు రోజులుగా రాకపోకలు నిలిచిపోయి ఈ సందర్భంగా వరద నీటికి కొట్టుకొని వచ్చిన వృక్షం బ్రిడ్జిపై అడ్డంగా ఉండిపోవడంతో ప్రవాహ ఉధృతి తగ్గిన అనంతరం కవిరిపల్లి గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి కార్యకర్తలు మరియు ప్రజలు కలసి బ్రిడ్జిపై అడ్డంగా ఉన్న వృక్షాన్ని తొలగించారు. వీరిని గ్రామ పెద్దలు పలువురు అభినందించారు. కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు పెంట. సంజీవి నాయుడు, భాను,



శంకర్రావు, తదితరులు పాల్గొన్నారు.

# మూడవ డివిజన్‌లో ఉవ్వెత్తున ఉద్యమంలా సాగుతున్న వైస్సార్సీపీ కోటి సంతకాల సేకరణలో కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు 3వ డివిజన్ కిసాన్ నగర్ లో వైసిపి డివిజన్ ఇన్ చార్జ్ అక్కలరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్సిపి నాయకులతో కలిసి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా మొదట పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి రచ్చబండ కార్యక్రమం నిర్వహించి డివిజన్ స్థాయి కమిటీలపై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకునే దిశగా వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపునిచ్చిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రజలకు వివరించారు మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకునే దిశగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటానికి స్థానిక ప్రజలు తమ సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ కోటి సంతకాల సేకరణ పత్రులపై సంతకాలు చేశారు.

ఈ సందర్భంగా పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి ఈ రాష్ట్రానికి ఏకంగా 17 నూతన మెడికల్ కళాశాలను తీసుకు రావడం జరిగిందని అన్నారు. ప్రజా ఆకాంక్షలకు వ్యతిరేకంగా.. చంద్రబాబు నాయుడు మెడికల్ కళాశాలలను..ప్రైవేటుకు అప్పగించడం దుర్మార్గమని మండిపడ్డారు మెడికల్ కళాశాలాలను తమ పార్టీ నేతలకు అప్పనంగా దోచి పెట్టేందుకే..చంద్రబాబు నాయుడు ఇలాంటి అనాలోచిత నిర్ణయం తీసుకున్నారని అన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తూ.. వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు కోటి సంతకాల ఉద్యమం చేపడుతున్నామని అన్నారు. అందులో భాగంగా నెల్లూరు నగర నియోజకవర్గంలో 3 వ డివిజన్ కిసాన్ నగర్‌లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నడం చూస్తుంటే.. ఈ సంతకాలు నెల్లూరు నగర నియోజకవర్గంలో 60000 కాదు లక్ష దాటే అవకాశం కనిపిస్తుందన్నారు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసి.. కూటమి ప్రభుత్వానికి ప్రజా ఆకాంక్షను బలంగా తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి కోటేశ్వరరెడ్డి, 5, 11 డివిజన్ ఇన్ చార్జ్‌లు సుబ్బారెడ్డి, మహేష్ యాదవ్, వైసిపి నేతలు రామచంద్రయ్య, హరిబాబు, అభిషేక్ రెడ్డి, ధనుంజయ, మల్లి ఖార్జున, రాజ్ కుమార్, సుజాతమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నవజీవన్ ఆర్గనైజేషన్ - సి.సి - పి.యు - ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో "ఇంటెన్సిఫైడ్ ఐ.ఇ.సి క్యాంపెయిన్" కార్యక్రమం ద్వారా హెచ్.ఐ.వి/ ఎయిడ్స్‌పై అవగాహన









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశముల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ విభాగం సహకారంతో ఈరోజు నవజీవన్ ఆర్గనైజేషన్ –సి.సి– పి.యు– ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో " ఇంటెన్సిఫైడ్ ఐ.ఇ.సి క్యాంపెయిన్" కార్యక్రమం ద్వారా హెచ్.ఐ.వి/ఎయిడ్స్‌పై అవగాహన సదస్సును నాయుడు పేట మండలంలోని పుదూరు గ్రామంలో ఉన్న "జెడ్.పి. హైస్కూల్" నందు నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమములో భాగముగా ప్రాజెక్ట్ మేనేజర్ అయిన కె.బాలాజి మాట్లాడుతూ హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాప్తి కారకాలు, ఎలా వ్యాపించదు, హెచ్. ఐ.వి/ఎయిడ్స్ లక్షణాలు, అవి రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్న చూపు లేకుండా ఎలాగా సమాజములో కలసి జీవించాలి, హెచ్.ఐ.వి/ఎయిడ్స్, క్షయ వ్యాధి సంబందం గూర్చి, సుఖ వ్యాధులు మరియు చికిత్స గూర్చి, డ్రగ్స్ వాడకం వలన కలిగే ఇబ్బందులు, కండోమ్ యొక్క ఉపయోగము గూర్చి, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ ఏక్ట్ 2017, ఎ.ఆర్.టి మందులు, ఏ.పి.శాక్స్ యాప్, టోల్ ఫ్రీ నెంబర్ 1097 గూర్చి తెలుపుతూ, మీ ద్వారా తెలియని వాళ్లకు తెలియజేయమని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమం లో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు టి.శివప్రసాద్, ఉపాధ్యా యులు కె.శ్రీనివాసులు, యస్.కె.ముస్తఫా, ఓ.ఆర్.డబ్ల్యూలు యమ్. సాయి లక్ష్మి, టి.శ్రావణి, పి.ఇలు మరియు 110 మంది విద్యార్థులు పాల్గొనడం జరిగింది. తదుపరి విద్యార్థులుతో కలిసి పుదూరు గ్రామంలో అవగాహన ర్యాలీని నిర్వహించడం జరిగింది. తదుపరి ఇందిరా కాలనీ ఏరియాలో హెచ్.ఐ.వి/ఎయిడ్స్ పై అవగాహన కల్పించడం కోసం మీటింగ్ మరియు ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీలో 60 మంది ప్రజలు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది. వీరిలో 10 మంది ప్రజలుకు నవజీవన్ సంస్థ ఎ.యన్.యమ్ జి.శ్రీలత ద్వారా హెచ్.ఐ.వి పరీక్షలు చేయించి వారి స్థితిని వారికి తెలియజేయడం జరిగింది.

# సమ్మె విరమణ.. ఎన్టీఆర్ వైద్య సేవలు పునరుద్ధరణ

**అమరావతి, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ ఆస్పత్రుల అసోషియేషన్‌తో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ఈ క్రమంలో సమ్మె విరమించాలని ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ కింద ఉన్న స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్ నిర్ణయించింది. వైద్య సేవా పథకం కింద సేవలన్నింటినీ పున:ప్రారంభించాలని నిర్ణయించినట్లు అసోసియేషన్ ప్రకటించింది. రాష్ట్రంలో ఎన్టీఆర్ వైద్యసేవల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రయత్నాలు ఫలించాయి. శుక్రవారం సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్‌తో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమర్ యాదవ్ చర్చలు జరిపారు. వెంటనే రూ.250 కోట్ల బకాయిల చెల్లింపునకు ప్రభుత్వం అంగీకారం తెలపడంతో ప్రభుత్వ ఆస్పత్రుల అసోషియేషన్ సమ్మె విరమించింది. నవంబర్ 15 లోపు 250 కోట్ల రూపాయలు విడుదల చేసేందుకు ప్రభుత్వం అంగీకరించిందని అసోషియేషన్ వెల్లడించింది. అన్ని బకాయిల పరిష్కారానికి ఒకేసారి సెటిల్‌మెంట్ విధానానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని పేర్కొంది. ఈ నిర్ణయాలు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో ఆరోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాయని




అసోసియేషన్ పేర్కొంది. ఈ మేరకు ఏపీ స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్ ప్రకటనను విడుదల చేసింది. తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన సీఎం చంద్రబాబు, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ట్రస్ట్ వైస్ ఛైర్మన్ సుధాకర్, ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి, వైద్య సేవ ట్రస్ట్ సీఈవోకు అసోసియేషన్ కృతజ్ఞతలు తెలియజేసింది.

# సీఎం చంద్రబాబు ప్రేరణతో అధికారులు, నాయకులు సమన్వయంతో పనిచేశారు









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** తుఫాను తీవ్రతపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతర పర్యేక్షణ చేస్తూ అధికార యంత్రాంగాన్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడం వల్లే ఆస్థి, ప్రాణ నష్టాలను నివారించగలిగామన్నారు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. ఇందుకూరు పేట మండల కేంద్రంలో మంధా తుఫాను కారణంగా ఉపాధి కోల్పోయిన మత్స్యకార సోదరులకు ఆమె నిత్యావసర సరుకుల కిట్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ మత్స్యకార సోదరులకు ప్రభుత్వం తక్షణ సహాయంగా 50 కిలోల బియ్యంతో పాటు 1 కిలో కందిపప్పు, 1 కేజీ పామాయిల్, కిలో ఉల్లగడ్డలు, కిలో ఎర్రగడ్డలు అందచేసిందనన్నారు. ముంపు ప్రాంత వాసులను పునరావాస కేంద్రాలకు తరలించి అధికారులతో కలిసి సహాయక చర్యలలో పాల్గొన్న టిడిపి మరియు కూటమి పార్టీ నాయకులను ఆమె అభినందించారు. నిత్యం అందుబాటులో వుంటూ పరస్పర సమన్వయంతో పని చేసి ప్రజలకు ఏ ఇబ్బంది రాకుండా కంటికి రెప్పలా కాపాడిన రెవెన్యూ, పోలీస్ మరియు వైద్య శాఖాధికారుల పనితీరును ఆమె ప్రశంసించారు. చంద్రబాబు ప్రేరణతో తుఫాను సహాయక బాధ్యతను తమ భూజాల కెత్తుకొని సహాయక శిబిరాలలో వుంటున్న బాధితులకు భోజనం, చిన్న పిల్లలకు పాలు అందించన నాయకులు, కార్యకర్తలు ముందు ముందు యిదే స్ఫూర్తితో పని చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గోపికృష్ణ, ఎంపీడీఓ నాగేంద్ర బాబు, జెడ్ పి వైస్ ఛైర్మెన్ శ్రీహరికోట విజయలక్ష్మి, టిడిపి మండల అధ్యక్షులు ఏకొల్లు పవన్ కుమార్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి, వెస్ట్ పాళెం పెద్ద కాపు ఊటుకూరు సుబ్రహ్మణ్యం, ఈస్ట్ పాళెం పెద్దకాపు శ్రీహరి శ్రీనివాసులు, మత్స్యకార నాయకులు పామంజి నరసింహ, ఊటుకూరు రాజ, ముక్కంటి చంద్ర, కటారి బాబు, అంగేరి మల్లయ్య, ముక్కంటి అంకయ్య, వైస్ ప్రెసిడెంట్ ఊటుకూరు ప్రసాద్, వియ్యాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పటేల్ కలలు సాకారం కోసమే సమైక్యత పరుగు : మాధవ్



**విజయవాడ, (రాజధాని వార్తలు):** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా విజయవాడలో ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం ఇందిరాగాంధీ స్టేడియం నుంచి బెంజిసర్కిల్ వరకు ర్యాలీ సాగింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ కేశినేని శివనాథ్, ఇతర నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ...దేశాన్ని ఒక్కటిగా చేసిన మహనీ యుడు సర్దార్ పటేల్ అని కొనియాడారు. ఆయన కలలు సాకారం చేసేలా ఆయన జయంతి రోజు సమైక్యత పరుగు నిర్వహిస్తున్నామని తెలిపారు. భారత దేశ తొలి హోమ్ మినిస్టర్‌గా పనిచేసిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ కారణంగా భారతదేశమంతా సమైక్యంగా ఉందన్నారు. స్వేచ్ఛతో ముందుకు వెళుతున్నామని తెలిపారు. ఆయన 150వ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా పటేల్‌ను స్మరిస్తూ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. దేశంలో ఉన్న 560 సంస్థానాలను కలిపి భారతదేశం అంతా ఒకటిగా చేసిన వ్యక్తి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని పేర్కొన్నారు. స్వాతంత్రం తర్వాత కూడా ఆయన నిరంతర కృషితో ప్రజల కోసం, దేశం కోసం పని చేశారన్నారు. నిజాంలు స్వయం ప్రతిపత్తి కోరితే దేశమంత సమైక్యంగా ఉండాలని దేశంలో అందరూ భాగస్వామ్యం కావాలని వారికి గట్టిగా చెప్పిన వ్యక్తి పటేల్ అని చెప్పుకొచ్చారు. ఆయన నేతృత్వంలో జమ్మూకాశ్మీర్ సమస్యను పరిష్కరించేందుకు కూడా కృషి చేశారని తెలిపారు. ఆనాడు నెహ్రూ తొందరపాటు నిర్ణయం వల్ల నాటి నుంచి 2019 వరకు ఆ సమస్య అలాగే ఉందన్నారు. ప్రధాని మోడీ రెండోసారి అధికారంలోకి రాగానే 370 అధికరణ కింద జమ్ము కాశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేశారన్నారు. భారతదేశ ప్రజలందరూ స్వదేశీ వస్తువుల్ని కొనుగోలు చేయాలని కోరారు. లోకల్ ఫర్ వోకల్ నినాదాన్ని అందుకొని మనవారిని మనమే ప్రోత్సహించుకోవాలని సూచించారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజలందరూ కూడా స్వదేశీ ఉద్యమాన్ని ప్రారంభించాలని బీజేపీ ఏపీ చీఫ్ మాధవ్ పిలుపునిచ్చారు.

**పటేల్ త్యాగానికి గుర్తింపుగా: ఎంపీ కేశినేని**

సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశం సమగ్రతను చాటారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. సంస్థానాలు విలీనం చేశారన్నారు. పటేల్ త్యాగానికి గుర్తింపుగా ఏటా స్వతంత్ర దినోత్సవం మాదిరిగా ఏకతా ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. యూనిటీ మార్చ్‌ను ఆయన అడుగుజాడల్లో నడుస్తున్నామని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు.

# యూనిటీ మార్చ్‌లో పాల్గొని విజయవంతం చేయండి : ఎంపీ

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఉక్కు మనిషి, దేశ తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా అక్టోబర్ 31న నెల్లూరులో జరిగే యూనిటీ మార్చ్ పాదయాత్రలో యువత, వివిధ రంగాల నిపుణులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సంవత్సరం జాతీయ సమైక్యతా నిర్మాత సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి అని తెలిపారు. ఆయన అసాధారణ కృషి, వారసత్వాన్ని గౌరవిస్తూ, కేంద్ర యువజన వ్యవహారాలు, మరియు క్రీడల మంత్రిత్వ శాఖ సర్దార్@150" అనే కార్యక్రమాన్ని ప్రారంభిస్తోందని చెప్పారు. ఏక్తా దివస్ సందర్భంగా అక్టోబర్ 31న ఉదయం Sardar@150Unity March అనే పేరుతో మై భారత్ నెల్లూరు, ఎన్ ఎస్ ఎస్, జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని విఆర్‌సీ మైదానం నుంచి ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు వేదాయపాలెం వరకు నిర్వహించే 5 కిలోమీటర్ల పాదయాత్రను జయప్రదం చేయాలన్నారు. దేశ సమైక్యతలో పౌరులను వికసిత్ & ఆత్మనిర్భర్ భారత్ వైపు నడిపించడంతో పాటు సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను గౌరవించడం ఈ పాదయాత్ర ఉద్దేశమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో పాల్గొని సర్దార్ వల్లభాయ్ పటేల్ వారసత్వం కాపాడుకోవడంతో పాటు ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధుల వ్వాలన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యన్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- , అరవింద స్కూల్ పేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పాస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్స్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# రాష్ట్ర వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్ 'పీఎం శ్రీ ఎయిర్ టూరిజం హెలికాప్టర్ సర్వీస్'ను ప్రారంభించనున్నారు

**- దేశంలో అంతర్-రాష్ట్ర వాయు అనుసంధానాన్ని ఏర్పాటు చేసిన మొదటి రాష్ట్రంగా మధ్యప్రదేశ్ అవతరించింది - 70వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కొత్త విమానంలో ప్రయాణించనున్న మధ్యప్రదేశ్‌లో పర్యాటకం - నవంబర్ 20 నుండి మూడు రంగాలలో రెగ్యులర్ కార్యకలాపాలు ప్రారంభం - ఎంపీ టూరిజం బోర్డు ప్రభుత్వ - ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) నమూనా కింద సేవలు ప్రారంభం - పర్యాటకానికి కొత్త కోణాన్ని అందించడానికి పర్యాటకులకు మెరుగైన ప్రయాణ సౌకర్యం**

**భోపాల్:** మధ్యప్రదేశ్ 70వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా, రాష్ట్రం పర్యాటక రంగంలో ఒక అద్భుతమైన బహుమతిని అందుకోనుంది. ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్ నవంబర్ 1, 2025న భోపాల్‌లోని రాజా భోజ్ విమానాశ్రయంలో 'పీఎం శ్రీ ఎయిర్ టూరిజం హెలికాప్టర్ సర్వీస్'ను ప్రారంభిస్తారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు, కేంద్ర చట్టం మరియు న్యాయ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) శ్రీ అర్జున్ రామ్ మేఘ్వాల్, పర్యాటక, సంస్కృతి మరియు మతపరమైన ట్రస్ట్ & ఎండోమెంట్ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) ధర్మేంద్ర భావ్ సింగ్ లోధీ హాజరు కానున్నారు. ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించిన తర్వాత, మూడు హెలికాప్టర్లు ఉజ్జయినీకి బయలుదేరుతాయి. హెలికాప్టర్ సర్వీస్ యొక్క సాధారణ కార్యకలాపాలు నవంబర్ 20, 2025 నుండి ప్రారంభమవుతాయి. రాష్ట్రంలోని ప్రధాన పర్యాటక ప్రదేశాల మధ్య వాయు కనెక్టివిటీని బలోపేతం చేసే లక్ష్యంతో మధ్యప్రదేశ్ పర్యాటక శాఖ 'పీఎం శ్రీ ఎయిర్ టూరిజం హెలికాప్టర్ సర్వీస్'ను ప్రారంభిస్తోందని పర్యాటక, సంస్కృతి మరియు మతపరమైన






ట్రస్ట్ & ఎండోమెంట్ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) శ్రీ ధర్మేంద్ర భావ్ సింగ్ లోధీ తెలిపారు. ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం నమూనా కింద ప్రారంభించబడిన ఈ సేవ మధ్యప్రదేశ్‌లో పర్యాటక రంగానికి కొత్త ఉత్సాహాన్ని ఇస్తుందని, ప్రయాణాన్ని వేగవంతంగా, మరింత సౌకర్యవంతంగా మరియు సందర్శకులకు మరింత చిరస్మరణీయంగా మారుస్తుందని ఆయన అన్నారు. పర్యాటక, సంస్కృతి, గృహ, మతపరమైన ట్రస్టులు & ఎండోమెంట్స్ అదనపు ప్రధాన కార్యదర్శి మరియు మధ్యప్రదేశ్ పర్యాటక బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ షియో శేఖర్ శుక్లా మాట్లాడుతూ, భారతదేశంలో అంతర్-రాష్ట్ర వాయు రవాణాను నిర్వహిస్తున్న మొదటి రాష్ట్రంగా మధ్యప్రదేశ్ అవతరిస్తుందని అన్నారు. 'పిఎం శ్రీ ఎయిర్ టూరిజం హెలికాప్టర్ సర్వీస్' ప్రధాన మత, వన్యప్రాణులు మరియు సహజ పర్యాటక గమ్యస్థానాల మధ్య ప్రయాణాన్ని మరింత అందుబాటులోకి మరియు ఆకర్షణీయంగా మారుస్తుందని ఆయన అన్నారు. ఈ చొరవ మధ్యప్రదేశ్‌లో పర్యాటకానికి కొత్త కోణాన్ని తెరుస్తుంది, రాష్ట్ర సాహసం, వారసత్వం మరియు ఆధ్యాత్మిక పర్యాటకానికి ఒక విలక్షణమైన గుర్తింపును ఇస్తుంది, అదే సమయంలో దేశీయ మరియు అంతర్జాతీయ పర్యాటకుల మొత్తం ప్రయాణ అనుభవాన్ని సుసంపన్నం చేస్తుంది. 'పిఎం శ్రీ ఎయిర్ టూరిజం హెలికాప్టర్ సర్వీస్' ప్రతి రంగంలో వారానికి ఐదు రోజులు పనిచేస్తుంది. కార్యాచరణ నిర్వహణ కోసం, సెక్టార్ 1 కోసం M/s ట్రాన్స్ భారత్ ఏవియేషన్‌తో మరియు సెక్టార్ 2 మరియు సెక్టార్ 3 కోసం M/s జెట్ సర్వ్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌తో మూడు సంవత్సరాల ఒప్పందంపై సంతకం చేయబడింది. ప్రారంభ దశలో, ప్రైవేట్ ఆపరేటర్లు ప్రతి సెక్టార్‌లో కనీసం ఆరు ప్రయాణీకుల సీట్ల సామర్థ్యంతో హెలికాప్టర్‌లను నడుపుతారు. హెలికాప్టర్ సర్వీస్ సెక్టార్లు: సెక్టార్ 1: ఇండోర్ - ఉజ్జయిని - ఓంకారేశ్వర్ సెక్టార్ 2: భోపాల్ - మధై - పచ్మరి సెక్టార్ 3: జబల్‌పూర్ - బాంధవ్‌ఘర్ - కన్హా.

# ఆపద కాలంలో జగన్ వ్యాఖ్యలు అర్ధరహితం : టీడీపీ సీనియర్ నేత ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో విధ్వంసం జరిగితే చూసి ఆనందించాలన్నదే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పంథా అని పొన్నూరు ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నేత ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. అతను అనుకున్న విధ్వంసం జరగలేదనే బాధ జగన్‌లో ఉందన్నారు. మొంథా తుపానును ప్రభుత్వం సమర్థంగా ఎదుర్కోవడం చూసి జగన్ ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. ఆపద సమయంలో ప్రభుత్వానికి- ప్రజలకు మధ్య వారధిగా ఉండాల్సిన జగన్ చేసే వ్యాఖ్యలు అర్ధరహితమన్నారు. జగన్ చేసే వ్యాఖ్యలు రాజకీయ లబ్ది కోసమే అని ఆరోపించారు. బెంగుళూరు ప్యాలెస్‌లో కూర్చుని జగన్ చేసే వ్యాఖ్యలు ఎవరూ నమ్మరని తెలిపారు. ఇన్సూరెన్స్ కట్టకుండా పంట భీమా చెల్లించామని జగన్‌లా కూటమి ప్రభుత్వం అసత్యాలు చెప్పదన్నారు. పంట నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని స్పష్టం చేశారు. అప్పుడు సీఎంగా జగన్ పొలంలో అడుగు పెట్టలేదని.. ఇప్పుడు కూడా అడుగు పెట్టటం లేదని విమర్శించారు. ఆపద కాలంలో జగన్ చేసే వ్యాఖ్యలు అర్ధరహితమని ధూళిపాళ్ల నరేంద్ర విమర్శలు గుప్పించారు.

**జగన్ వ్యాఖ్యలు హాస్యాస్పదం : యనమల**

తుపానును కూడా మానవ సృష్టి అని జగన్ అనటం హాస్యా




స్పదమని టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు అన్నారు. విపత్తులు అనేవి ప్రకృతి కోపానికి సంకేతాలని, వాటిని మనుషులు సృష్టించ లేరని జగన్ గ్రహించాలని హితవు పలికారు. 2024 ఎన్నికల్లో కూటమి సృష్టించిన రాజకీయ తుఫాను మాత్రం జగన్‌ను, ఆయన పార్టీని పూర్తిగా చెరిపేసిందంటూ వ్యాఖ్యలు చేశారు. జగన్ ఎప్పుడూ ప్రకృతి విపత్తుల ప్రాంతాలను సందర్శించలేదన్నారు. బెంగుళూరులో ఆస్తులను రక్షించడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే జగన్‌కు ప్రజల సమస్యలు పట్టవని విమర్శించారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన ముందస్తు, తుపాను తదనంతర చర్యలు ప్రశంసనీయమని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల యజ్ఞం ప్రజల మద్దతు లేకుండా కేవలం నకిలీ సంతకాలతో నడుస్తోందని యనమల పేర్కొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan